

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


## మూడు కర్తవ్యాల స్ఫూర్తితో కేంద్ర బడ్జెట్

- ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లు
- డేటా సెంటర్ల ఏర్పాటు సంస్థలకు శుభవార్త
- తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

VI

# కేంద్ర బడ్జెట్.. వికసిత భారతానికి ఊతం



- డేటా సెంటర్లకు టాక్స్ హాలిడేతో మరింతగా ఐటీ రంగం వృద్ధి
- రైతులు, మహిళలు, యువతలో ఆర్థిక సాధికారిత పెంచేలా కేటాయింపులు
- హైస్పీడ్ రైల్, రేర్ ఎర్త్ కారిడార్లతో ఏపీకి మరింత లబ్ధి
- కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను స్వాగతించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రికి అభినందనలు తెలిపిన సీఎం

*సంస్కరణల పథంలో దేశం వేగంగా దూసుకెళ్లేలా యువశక్తి ప్రేరేపిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు. మూడు స్పష్టమైన కర్తవ్యాల నుండి ప్రేరణ పొందిన ఈ బడ్జెట్ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తుంది, సామర్థ్య నిర్మాణం ద్వారా ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుంది. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ నిజమైన స్ఫూర్తితో సమ్మిళిత అభివృద్ధిని ముందుకు తీసుకువెళుతుంది. 7.4 శాతం బలమైన వృద్ధి దృక్పథంతో బడ్జెట్ రూపొందింది. 2025-26 నాటికి ద్రవ్యలోటును జీడీపీలో 4.5 శాతం కంటే తక్కువకు తీసుకువచ్చేలా 2021-22లో తీసుకున్న దృఢమైన సంకల్పానికి అనుగుణంగా ఆర్థిక క్రమశిక్షణ ఈ బడ్జెట్‌లో ప్రతిబింబిస్తోంది. కీలకమైన వృద్ధి రంగాలకు ప్రాధాన్యత ఇస్తూనే.. సమాజంలోని అన్ని వర్గాలకు, ప్రాంతాలకు, ప్రతి కుటుంబానికి సమాన అవకాశాలు, మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చేలా సమతుల్యతతో కూడిన ఈ బడ్జెట్ ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఉంది.*

*- సీఎం చంద్రబాబు నాయుడు*

2





## ఏపీకి ఎంతో మేలు

**- మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): భారతదేశ వేగవంతమైన అభివృద్ధి లక్ష్యాలకు, దీర్ఘకాలిక ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ బడ్జెట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన మేలు జరగనుందని అభిప్రాయపడ్డారు. క్రిటికల్ మినరల్స్ కారిడార్, హైస్పీడ్ రైలు అనుసంధానం, డేటా సెంటర్లకు పన్ను ప్రోత్సాహకాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి మరింత బలమైన ప్రోత్సాహం ఇస్తుందన్నారు. పర్యాటక రంగంపై నూతన దృష్టి వంటి కీలక అంశాలు ఇందులో ఉన్నాయని హర్షం వ్యక్తంచేశారు. ఈ బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని పెట్టుబడులను వేగవంతం చేయడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఆంధ్రప్రదేశ్ తదుపరి అభివృద్ధి దశకు శక్తినివ్వడం కోసం కృషి చేస్తామని వెల్లడించారు.

## నిష్కలంక నేత చంద్రబాబు!



- 'స్కిల్' కేసులో సీఎం చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్
- జగన్ అసత్యాల కుట్రలకు పాతర
- నిజం గెలిచింది.. న్యాయం నిలిచింది
- వైసీపీ ప్రభుత్వ కట్టుకథలను కొట్టేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ
- కడిగిన ముత్యంలా మెరిసిన టీడీపీ అధినేత

2



## పార్టీ కోసం పనిచేస్తే.. అండగా ఉంటా!

- పార్టీని బలోపేతం చేసిన వారిని నేను బలోపేతం చేస్తా
- ప్రజాప్రతినిధుల పనితీరును విశ్లేషిస్తున్నా
- చక్కటి పనితీరుతోనే పదవులు దక్కుతాయి
- కుప్పం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు

3

## వైసీపీ హయాంలో.. తిరుమలలో మహాపాపం!

- తప్పుచేసి తిరిగి నాపైనే ఆరోపణలు
- లడ్డూ కల్తీపై సీఎం చంద్రబాబు

కుప్పం (చైతన్యరథం): ఎన్‌డీబీబీ నివేదిక ఆధారంగానే తిరుమల కల్తీ నెయ్యి గురించి మాట్లాడానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమలలో వైసీపీ హయాంలో మహా పాపానికి ఒడిగట్టారని విమర్శించారు. కుప్పంలో ఆదివారం మీడియాతో సీఎం మాట్లాడుతూ 2019-24 మధ్య జరిగిన వారసత్వంగా వచ్చిన సమస్యలు ఉన్నాయి... వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళు_న్నామన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో నివేదిక వచ్చింది. తిరుమల పవిత్రతను కాపాడటానికి చర్యలు తీసుకుంటున్నాం. తిరుమల శ్రీవారి నెయ్యిలో కల్తీ జరిగిందని గతంలో ఎన్డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. తరువాత దీనిపై సిట్ విచారణ జరిపి నివేదిక ఇస్తే మళ్లీ నాపై వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. తిరుమల శ్రీవారికి అపచారం చేయడమే కాకుండా మహాపాపం చేసి దానిని కప్పి పుచ్చుకోవడానికి నాపైనే తిరిగి దాడి చేస్తున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిని కూడా రాజకీయం చేస్తున్నారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను నమ్మే దేవుడు వేంకటేశ్వరుడు. మహా ద్వారం ద్వారా వెళ్లే అవకాశం ఉన్నా... సామాన్య భక్తుడిగానే స్వామి దర్శనానికి వెళ్తున్నానని సీఎం తెలిపారు.

## రాష్ట్ర పునర్నిర్మాణాన్ని జీర్ణించుకోలేకనే వైసీపీలో ఫ్రస్టేషన్

- మేం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతల్ని పునరుద్ధరించాం
- విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు
- తాజా పరిణామాలపై సీఎం చంద్రబాబు ట్వీట్

3

## గంగజాతర ముందే మొదలైంది!

- మాస్ జాతర పాట ఆవిష్కరణ
- కుప్పం కార్యకర్తల సమక్షంలో విడుదల చేసిన సీఎం చంద్రబాబు

4



## ఈ ఏడాదిలో రాష్ట్రమంతటా 'సంజీవని'

- రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం
- 72 లక్షల మందికి వైద్య పరీక్షలతో హెల్త్ ప్రొఫైల్స్ రూపొందిస్తాం
- 'సంజీవని'కి సహకారంపై త్వరలో రాష్ట్రానికి బిల్ గేట్స్ రాక
- కుప్పంలోని తుమ్మిశిలో ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులు పరిశీలించిన సీఎం చంద్రబాబు

4



## టీటీడీ ఇవోగా ముద్దాడ రవిచంద్ర

- అనిల్ సింఘాల్‌పై బదిలీ వేటు
- తిరుమల కల్తీనెయ్యి వ్యవహారమే కారణం

3



# కేంద్ర బడ్జెట్.. వికసిత భారతానికి ఊతం

- డేటా సెంటర్లకు టాక్స్ హాలిడేతో మరింతగా ఐటీ రంగం వృద్ధి
- రైతులు, మహిళలు, యువతలో ఆర్థిక సాధికారిత పెంచేలా కేటాయింపులు
- హైస్పీడ్ రైల్ , రేర్ ఎర్త్ కారిడార్లతో ఏపీకి మరింత లబ్ధి
- కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను స్వాగతించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రికి అభినందనలు తెలిపిన సీఎం

కుప్పం (చైతన్యరథం): వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ రూపొందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్‌ను నిర్దేశించేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ఆదివారం కుప్పంలో జరిగిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు స్పందించారు. కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నట్టు ఆయన తెలిపారు. అభివృద్ధికి దోహదపడేలా బడ్జెట్‌ను తీర్చిదిద్దినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఫార్వార్డ్ లుకింగ్ బడ్జెట్. రాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విదానానికి ఈ బడ్జెట్ మరింత సహకరించేలా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్ఎంఈలపై ఎక్కువగా దృష్టి సారించింది. వీటిని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉంది. మహిళలు, రైతులు, యువత సాధికారిత సాధించేలా బడ్జెట్ ఉంది. 2047 వికసిత్ భారత్ డెవలప్డ్ ఎకానమీగా మారేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇది బ్యాలెన్సుడ్ బడ్జెట్. ఏఐ సహా ఆధునిక సాంకేతికత, తదుపరి స్థాయి సంస్కరణలకు బడ్జెట్ ఊతమిస్తుంది. పునరుద్పాదక విద్యుత్‌తో పాటు వన్ గ్రిడ్ వన్ నేషన్ దిశగా సహకారం అందిస్తుంది. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారు. మెరుగైన జీవన ప్రమాణాలు, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం దోహదం చేసేలా బడ్జెట్ ఉంది. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ ద్వారా రాష్ట్రానికి ఉపయోగం ఉంది. తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాలు ఈ హైస్పీడ్ కారిడార్ల ద్వారా అనుసంధానం అవుతాయి. బెంగుళూరు- చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ వల్ల పలమనేరు, చిత్తూరు, తదితర ప్రాంతాలకు కనెక్టివిటీ వస్తుంది. ఈ మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఏపీలోని వివిధ ప్రాంతాలను కవర్ చేస్తాయి. హైదరాబాద్, అమరావతి, బెంగళూరు, చెన్నై లాంటి నగరాలన్నీ అనుసంధానం అవుతాయి. డెడికేటెడ్ రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్లో ఏపీ కూడా ఉంది. అత్యంత విలువైన ఖనిజాలు వెలికి తీసి క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి ఉపకరించే అవకాశం ఉంది. ఐఎస్ఎం 2.0 ద్వారా సెమీ కండక్టర్ రంగానికి రూ.40 వేల కోట్లు పెట్టారు. టెక్స్‌టైల్ రంగం కూడా వృద్ధి చెందేలా బడ్జెట్ ఉంది. పర్యాటకానికి, హాస్పిటాలిటీకి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. అరకు రీజియన్ అభివృద్ధి అంశాన్ని కేంద్ర బడ్జెట్లో పెట్టారు. పులికాట్ సరస్సు అభివృద్ధికి కూడా బడ్జెట్లో నిధులు కేటాయించారు. ఫ్లెమింగోలు, ఇతర అరుదైన పక్షులకు కూడా ఆ ప్రాంతం ఆలవాలంగా ఉంటుంది. కోకోనట్, జీడి, కోకో, చందనం లాంటి పంటల అభివృద్ధికి కార్యాచరణ ప్రకటించారు. ఇవన్నీ ఏపీ అభివృద్ధికి మేలు చేసే అంశాలేనని ముఖ్యమంత్రి వివరించారు.



### లాజిస్టిక్స్ రంగంపై తొలిసారి కేంద్రం ప్రస్తావన

డేటా సెంటర్లకు 2047 వరకూ పన్ను మినహాయింపులు ఇచ్చారు. భారత్ డేటా సెంటర్ల హబ్‌గా తయారవుతుంది. విశాఖకు గూగుల్ సహా వివిధ డేటా సెంటర్లు వస్తున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగానికి ఊతమిచ్చేలా ఈ డేటా సెంటర్లు తయారవుతాయి. పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. 2047 వరకూ టాక్స్ హాలిడే వల్ల డేటా సెంటర్లు పెద్ద ఎత్తున దేశంలోకి విస్తరిస్తాయి. బిల్ గేట్స్ కూడా త్వరలో అమరావతిలో పర్యటించబోతున్నారు. ఏఐ, క్వాంటం, డేటా సెంటర్స్ లాంటి నెక్స్‌ట్ జెన్ టెక్నాలజీస్‌కు ఏపీ కేరాఫ్ అడ్రస్ గా ఉంటుంది. లాజిస్టిక్స్ రంగంపై ఏపీ పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. కేంద్ర బడ్జెట్టులో తొలిసారిగా లాజిస్టిక్స్ రంగం అభివృద్ధి గురించి ప్రస్తావించారు. ఈస్ట్ కోస్ట్ కారిడార్ వల్ల లాజిస్టిక్స్ పరంగా గణనీయమైన వృద్ధి నమోదు అవుతుంది. అంతర్గత జల రవాణా కోసం బడ్జెట్లో నిధులు పెట్టారు. వెయ్యి కిలోమీటర్ల పొడవైన మన తీర ప్రాంతం మొత్తం గణనీయమైన వృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో ఇప్పటికే లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. పట్టణాల అభివృద్ధి, గ్రోత్ సెంటర్లకు నిధులు కేటాయించారు. విశాఖ ఆర్థిక రీజియన్, తిరుపతి గ్రోత్ రీజియన్, అమరావతి రీజియన్లు వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉంది. కంటైనర్స్ ద్వారా లాజిస్టిక్స్ మరింత వేగవంతం అవుతాయి. రీజినల్ మెడికల్ హబ్స్ , ఆయుష్ హబ్స్ ఏర్పాటుకు కూడా బడ్జెట్లో నిధులు ఇచ్చారు. వీటన్నిటినీ ఇంటిగ్రేట్ చేసుకుని ఏపీ వృద్ధి చెందే అవకాశం ఉంది. సంజీవని ప్రాజెక్టు ఈ ఏడాదిలో ఓ గేమ్ చేంజర్ గా మారుతుందని సీఎం అన్నారు.

### స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మరింత ఊతం

వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానం ద్వారా ప్రతీ ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. 75 శాతం ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ ఇచ్చేలా కేంద్రం నిర్ణయించింది... రాష్ట్రం తరపున 20 శాతం ఇస్తున్నాం. స్పీడ్ ఆప్ డూయింగ్ బిజినెస్ కు వెళ్లేలా మరిన్ని సంస్కరణలు రావాలి. ఇప్పటికే జీఎస్టీ సంస్కరణలు, కార్మిక సంస్కరణలు వచ్చాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్ ద్వారా ఈజ్ ఆఫ్ లివింగ్ సాధ్యం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పాలసీలకు వెసులుబాటు కల్పించేలా బడ్జెట్ ఉంది. పూర్వోదయ ద్వారా నిధులు ఇస్తామని బడ్జెట్లో పెట్టారు. రాయలసీమను నెక్స్‌ట్ లెవల్‌కు తీసుకెళ్లేలా మేం ప్రయత్నాలు చేస్తాం. ప్రపంచంలోనే అత్యుత్తమ ఉద్యాన క్లస్టర్‌గా రాయలసీమ జిల్లాలు మారబోతున్నాయి. డీపీ వరల్డ్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఇక్కడికి వస్తున్నాయి. పూర్వోదయ ద్వారా నిధులు ఇచ్చేందుకు బడ్జెట్లో కేటాయింపులు చేశారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# నిష్కళంక నేత చంద్రబాబు!

- నిజం గెలిచింది.. న్యాయం నిలిచింది
- 'స్కిల్' కేసులో సీఎం చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్
- జగన్ అసత్యాల కుట్రలకు పాతర
- వైసీపీ ప్రభుత్వ కట్టుకథలను కొట్టేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ
- కడిగిన ముత్యంలా మెరిసిన టీడీపీ అధినేత

అమరావతి (చైతన్యరథం): సీఎం చంద్రబాబు సుదీర్ఘ, నిష్కళంక రాజకీయ చరిత్రలో అసత్యాలతో జగన్ రెడ్డి సృష్టించిన ఒక చీకటి అధ్యాయానికి తెరపడింది. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసు పేరుతో గత వైసీపీ ప్రభుత్వం అల్లిన కట్టుకథలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిలువునా పాతేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఈ కేసులో ఎటువంటి సంబంధం లేదని ఈడీ స్పష్టం చేసింది. ఈ మేరకు విశాఖపట్నంలోని పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టులో సప్లిమెంటరీ చార్జిషీటు దాఖలు చేసింది. రెండు రోజుల కిందట దాఖలు చేసిన ఈ చార్జిషీటులో, నిధుల మళ్లింపు లేదా నేరపూరిత కార్యకలాపాల్లో సీఎం చంద్రబాబుకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి సంబంధం లేదని ఈడీ స్పష్టంగా పేర్కొంది.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని చంద్రబాబుని 53 రోజుల పాటు జైల్లో ఉంచడం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక మాయని మచ్చ. 2023 సెప్టెంబర్‌లో ఎటువంటి ఆధారాలు లేకుండానే చంద్రబాబుని అక్రమంగా అరెస్టుచేసి, ఆయన వ్యక్తిత్వాన్ని హననం చేయాలని చూశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్‌లో చంద్రబాబు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ జగన్ రెడ్డి హయాంలో అక్రమంగా కేసు నమోదు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలులో నిర్బంధించారు. కానీ ఈ కేసులో ఒక్క రూపాయి మేర ఆర్థిక లావాదేవీలను కూడా జగన్ ప్రభుత్వం చూపించలేకపోయింది. సీఐడీ ద్వారా తప్పుడు నివేదికలు ఇప్పించి, దర్యాప్తు సంస్థలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం విఫలమైంది.

### కూలిన అబద్ధాల కోటలు

ఆంధ్రప్రదేశ్ సీఐడీ ఇప్పటికే ఈ కేసులో చంద్రబాబుకు ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేసి, విజయవాడ ఏసీబీ కోర్టులో కేసును విత్‌డ్రా చేసుకుంది. తప్పుగా నమోదు చేసిన కేసుగా గుర్తించి విజయవాడలోని ఏసీబీ కోర్టులో క్లోజర్ రిపోర్టును సమర్పించింది. చంద్రబాబుపై మోపిన ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని సీఐడీ తన నివేదికలో వెల్లడించింది. ఈ నివేదికను అంగీకరించిన కోర్టు ఇటీవలే చంద్రబాబుతో పాటు మరో 36 మందిపై ఉన్న కేసును అధికారికంగా కొట్టివేసింది.

తాజాగా ఈడీ కూడా తమ దర్యాప్తులో చంద్రబాబు పాత్ర లేదని స్పష్టం చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో జరిగినట్లుగా చెబుతున్న మనీలాండరింగ్‌లో గానీ, నిధుల మళ్లింపులో గానీ చంద్రబాబు పాత్ర ఏమాత్రం లేదని ఈడీ తేల్చిచెప్పింది. గతంలో దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదులో కానీ, ఇప్పుడు సమర్పించిన అనుబంధ చార్జ్‌షీట్‌లో కానీ చంద్రబాబును ఈడీ నిందితుడిగా చేర్చలేదు. ప్రాజెక్టుకు సంబంధించిన నేరపూరిత కార్యకలాపాల్లో గానీ, లబ్ధి పొందడంలో గానీ ఆయన ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొన్నట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదని దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ కేసులో మిగతా వ్యక్తుల పాత్రపై ఈడీ ఛార్జ్‌షీట్ ఫైల్ చేసింది. ప్రభుత్వం నుంచి 10 శాతం నిధులు తీసుకుని వాటిని డిజైన్‌టెక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, దానికి సంబంధించిన వ్యక్తులు షెల్ కంపెనీల ద్వారా మళ్లించినట్లు ఈడీ గుర్తించింది. సుమారు రూ.54.74 కోట్ల విలువైన ఆస్తులను కూడా అటాచ్ చేసింది.

### ధర్మం గెలిచింది

యువతకు నైపుణ్యాన్ని అందించి ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో చేపట్టిన రూ.3,300 కోట్ల సీమెన్స్ ప్రాజెక్టును అవినీతిమయంగా చిత్రీకరించిన వైసీపీ నేతలు ఇప్పుడు సమాజానికి ఏం సమాధానం చెబుతారు? అబద్ధానికి ఆయుష్షు తక్కువని, నిజం నిలకడ మీద తెలుస్తుందని ఈ తీర్పు మరోసారి రుజువు చేసింది. తప్పుడు కేసులతో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబును మానసికంగా కుంగదీయాలని చూసిన జగన్ క్రూర మనస్తత్వం ఇప్పుడు బట్టబయలైంది. నాడు గల్లీ నుంచి ఢిల్లీ దాకా వైసీపీ నేతలు చేసిన యాగీ అంతా వట్టిదేనని తేలిపోయింది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ద్వారా వేలమంది యువతకు నైపుణ్యం అందించాలనే సదుద్దేశంతో చేపట్టిన కార్య క్రమాన్ని అవినీతి అంటూ చిత్రికరించిన వైసీపీ నోటికి ఈడీ తాజా నివేదికతో ప్లాస్టర్ పడింది. వైసీపీ అల్లిన విషపు వల నుండి చంద్రబాబునాయుడు నూటికి నూరు శాతం నిర్దోషిగా బయటకు వచ్చారు. చంద్రబాబుపై బురద చల్లడమే లక్ష్యంగా సాగిన వైసీపీ దుష్ప్రచారానికి ఈడీ నివేదిక చెంపపెట్టు.

ఈ పరిణామాలు రాజకీయంగా, న్యాయపరంగా చంద్రబాబుకు పెద్ద విజయంగానిలిచాయి. ప్రభుత్వ నిధులను దారి మళ్లించి స్కామ్ చేశారన్న ఆరోపణలను కేంద్ర దర్యాప్తు సంస్థ, రాష్ట్ర దర్యాప్తు సంస్థ రెండూ తోసిపుచ్చడంతో, వైసీపీ అల్లిన కట్టుకథలకు తెరపడినట్లయింది.

# పార్టీ కోసం పనిచేస్తే.. అండగా ఉంటా!

- పార్టీని బలోపేతం చేసిన వారిని నేను బలోపేతం చేస్తా
- ప్రజాప్రతినిధుల పనితీరును విశ్లేషిస్తున్నా
- చక్కటి పనితీరుతోనే పదవులు దక్కుతాయి
- కుప్పం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు




కుప్పం (చైతన్యరథం): ప్రజల కోసం... పార్టీ బలోపేతం కోసం పనిచేసే వారికి ఎవ్వరి రికమెండేషన్లు అక్కర్లేదని... పదవులు వెతుక్కుంటూ వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు షణ్ముఖ రెడ్డికి అలాగే పదవి దక్కిందని సీఎం వెల్లడించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా చివరి రోజైన ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో నేతల పనితీరు మీద కూలంకుషంగా సమీక్షించారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టి 3 ఏళ్లు అయిన సందర్భంగా రూపొందించిన పాటను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...గతంలోనూ.. ఇప్పుడూ కుప్పంలో ప్రారంభించిన కార్యక్రమాలనే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేశామన్నారు. కార్యకర్తలు కష్టపడి, నిబద్ధతతో పని చేయడంతో షణ్ముఖ రెడ్డికి పార్లమెంట్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాను. నిన్నటి వరకు షణ్ముఖ రెడ్డి సామాన్య కార్యకర్త... నేడు పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు. తెలుగుదేశం పార్టీ జెండా భుజాన మోసి గెలిచే వరకు పని చేయడం టీడీపీ కార్యకర్తలకు అలవాటు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా... సంక్షోభాలు వచ్చినా టీడీపీ కాబట్టే నిలదొక్కుకోగలిగింది. చరిత్రలో ఎప్పుడూ రానంత మెజార్టీ కూటమికి, టీడీపీకి వచ్చింది. వైసీపీ ప్రతిపక్ష హోదా దరిదాపుల్లోకి కూడా రాలేకపోయింది. ప్రజలతో ఉంటేనే ఇలాంటి గెలుపు సాధ్యమవుతుంది. 2028 నాటికి నా రాజకీయ జీవితం 50 ఏళ్లకు చేరుతుంది. అభివృద్ధికి పునాదులు వేసింది.. వేసేది టీడీపీనే... విజన్-2020తో ఇది నిరూపితమైంది. ప్రజల భవిష్యత్ కోసమే... ప్రజల సంక్షేమం కోసమే తన ఆలోచనలని సీం వెల్లడించారు.



## కమ్యూనికేషన్ గ్యాప్ రాకూడదనే టెక్నాలజీ వినియోగం

పార్టీని బలోపేతం చేసిన వాళ్లను వెతుక్కుని వచ్చి దండ వేసి గౌరవిస్తాను. నిర్మొహమాటంగా మాట్లాడతా...వాస్తవాలు చెబుతా...తప్పులు సరి చేసుకోమని సూచిస్తా... అప్పటికీ మారకుంటే నమస్కారం పెడతాను. ఎమ్మెల్యేల పని తీరు ప్రతి వారం విశ్లేషిస్తూనే ఉన్నాను. కార్యకర్తలకు, నాకు కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా ఉండేందుకు పార్టీలో కూడా టెక్నాలజీని వినియోగిస్తున్నాం. ప్రజలకు సంక్షేమం చేస్తామని ఇంటింటికి వెళ్లి చెప్పాం...ఆ సంక్షేమాన్ని ఇప్పుడు అమలు చేస్తున్నాం. ఇప్పుడు కూడా ఇంటింటికి వెళ్లాలి. ప్రభుత్వం చేస్తున్న మంచిని చెప్పాలి. ప్రభుత్వం ఎంత ఇబ్బందికర పరిస్థితుల్లో పని చేస్తుందో ప్రజలకు వివరించాలి. కూటమిలోని పార్టీలతో కలిసి పని చేయాలి. ఒకే సీజన్లో హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తెచ్చాం. హంద్రీ-నీవా ద్వారా నీళ్లు రాకుంటే... కుప్పం నియోజకవర్గంలో ఇబ్బందులు వచ్చేవి. భారత దేశానికి అమరావతి లాంటి కొత్త నగరాలు అవసరమని ఆర్థిక సర్వేలో చెప్పారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పాం.. చేసి చూపించాం. దేశంలోనే ఉద్యాన ఉత్పత్తుల్లో రాయలసీమ మొదటి స్థానంలో ఉంది. సీమలో ఉద్యాన రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

అంతకు ముందు ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. కుప్పంలో 150 చెరువులను నింపినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పంలో 100 శాతం స్ట్రైక్ రేట్ తో విజయం సాధించేలా పని చేయాలన్నారు. తాను చేసిన పనిని గుర్తించి తనకు పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపిన ధన్యావాదాలు తెలిపిన చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు షణ్ముఖ రెడ్డి. కుప్పంలో ఉంటే పేదరికం ఉండదనే రీతిలో సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారని షణ్ముఖ రెడ్డి అన్నారు. ఫ్లెక్సీలు కట్టకున్నా... బ్యానర్లు వేయకున్నా పార్టీ కోసం పని చేసిన తన కష్టాన్ని పార్టీ అధినాయకత్వం గుర్తించిందంటూ షణ్ముఖ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో కుప్పం స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర పునర్నిర్మాణాన్ని జీర్ణించుకోలేకనే వైసీపీలో ఫ్రస్టేషన్

- మేం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతల్ని పునరుద్ధరించాం
- విఘాతం కలిగిస్తే ఉపేక్షించేంది లేదు
- తాజా పరిణామాలపై సీఎం చంద్రబాబు ట్వీట్



అమరావతి (చైతన్యరథం) : శాంతి,భద్రతల పరిరక్షణలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాజా పరిణామాలపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. ఏపీ రాజకీయాలను నేరమయం చేసిన సంస్కృతి వైసీపీదే. వైసీపీ పాలనంతా చట్టరహితంగానే కొనసాగింది. నేరమయ రాజకీయాలు వైసీపీ సిద్ధాంతం. వారి హయాంలో జరిగిన చట్టవిరుద్ధ పాలనే దీనికి నిదర్శనం. 2024 తర్వాతే రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలు అవుతోంది. ప్రజలకు సేవ చేయటం వారికి సాధికారత కల్పించటం మా సిద్ధాంతం. వైసీపీ నిజ స్వరూపం బయటపడుతున్న కొద్దీ అసహనంతో దూషణలకు దిగుతున్నారు. వాళ్లు విధ్వంసం చేసిన వ్యవస్థలు పునర్నిర్మాణం జరుగుతున్న తీరును చూసి ఓర్వలేక పోతున్నారు. రాజ్యాంగమే సుప్రీం. మేం నెలకొల్పిన శాంతిభద్రతల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడి తీరుతాం. చట్ట ఉల్లంఘనలకు ఎవరినీ అనుమతించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# టీటీడీ ఇవోగా ముద్దాడ రవిచంద్ర

- అనిల్ సింఘాల్‌పై బదిలీ వేటు
- తిరుమల కల్తీనెయ్యి వ్యవహారమే కారణం



అమరావతి (చైతన్యరథం): కల్తీ లడ్డు వివాదంలో కూరుకున్న టీటీడీ ఇవో అనిల్ కుమార్ సింఘాల్ పై బదిలీ వేటు పడింది. జగన్ ప్రభుత్వంలో టీటీడీకి నెయ్యి సరఫరా నిబంధనలను మార్చిన సమయంలోనూ ఆయనే టీటీడీ ఇవోగా ఉన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు నియమించిన సిట్ నివేదికలో అసలు ఆవులు లేవు, నెయ్యి లేదు, అంతా రసాయన మిశ్రమం అని తేల్చడంతో ప్రభుత్వం చేతిలో వున్న అధికారాన్ని ఉపయోగించి ఆకస్మికంగా అనిల్ సింఘాల్ పై వేటు వేశారు.

టీటీడీ నూతన ఇవోగా సమర్థుడైన డైనమిక్ ఐఏఎస్ అధికారి రవిచంద్ర ముద్దాడను పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ఆయన ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. ఆ విధులు నిర్వహిస్తూనే టీటీడీ ఈవో బాధ్యతలు కూడా చేపట్టనున్నారు.

రవిచంద్ర ముద్దాడ 1996 బ్యాచ్ కు చెందిన ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ఉమ్మడి రాష్ట్రంలో 2003లో రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అప్పట్లో సంచలనం సృష్టించారు. వివాదస్పదంగా మారి కబ్జాకు గురైన వందల కోట్ల భూమిని కాపాడి ప్రభుత్వానికి అప్పగించి గుర్తింపు పొందారు. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో మేటి అధికారిగా పేరు పొందారు. నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు.

కోవిడ్ సమయంలో ఆరోగ్యశాఖ కార్యదర్శిగా ఆయన చేసిన సేవలు అసామాన్యం. ఎంతో సింపుల్‌గా డౌన్ టు ఎర్త్ వుండే అధికారి. తనకు అప్పగించిన విధులను చిత్తశుద్ధితో నిర్వహించే సమర్థుడైన అధికారి. ఏ రాజకీయ పార్టీ ప్రభుత్వ అధికారంలో వున్నా, వ్యక్తిగత పేరు కన్నా ప్రభుత్వానికి పేరు రావాలని నిజాయితీగా కష్టపడి పని చేసే అత్యుత్తమ అధికారి రవిచంద్ర ముద్దాడ.

చైతన్యరథం

# ఈ ఏడాదిలో రాష్ట్రమంతటా సంజీవని





- రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దటమే లక్ష్యం
- 72 లక్షల మందికి వైద్య పరీక్షలతో హెల్త్ ప్రొఫైల్స్ రూపొందిస్తాం
- 'సంజీవని'కి సహకారంపై త్వరలో రాష్ట్రానికి బిల్ గేట్స్ రాక
- కుప్పంలోని తుమ్మిశిలో ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులు పరిశీలించిన సీఎం చంద్రబాబు

కుప్పం (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా 72లక్షల మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్స్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పని చేస్తున్నామని సీఎం వెల్లడించారు. కుప్పం నియోజకర్గం శాంతిపురం మండలం తుమ్మిశి గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. ఆ గ్రామంలోని ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను స్వయంగా పరిశీలించారు. సంజీవని ప్రాజెక్టు అమలు గురించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వివిధ అంశాలను తెలుసుకున్నారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యారోగ్య శాఖ రూపొందించిన డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా వివిధ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారి నుంచి సమాచారం తెలుసుకున్నారు.వారి ఆరోగ్యాన్ని మెరుగు పర్చేందుకు నిపుణులైన వైద్యులతో పాటు ఔషధాలను ఇచ్చేలా సంజీవని ప్రాజెక్టు ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అత్యుత్తమ టెక్నాలజీ ద్వారా ప్రజల ఆరోగ్య అంశాలను పర్యవేక్షించేలా ఈ ప్రాజెక్టు చేపట్టామని వివరించారు. బిల్ గేట్స్ ఫౌండేషన్, టీసీఎస్ సహకారంతో ఈ డిజి నెర్వ్ సెంటర్ ద్వారా ప్రతీ ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేస్తున్నామని తెలిపారు. సంజీవని ప్రాజెక్టు అమలుతో పాటు మరిన్ని రంగాల్లో సహకారం అందించేందుకు త్వరలోనే బిల్ గేట్స్ రాష్ట్రానికి రానున్నారని సీఎం వివరించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన సంజీవని ని ప్రస్తుతం చిత్తూరు జిల్లాకు విస్తరించామని.. ఈ ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేలా కార్యాచరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో నమోదు అయిన వైద్య పరీక్షల వివరాలను డిజిటల్ గా మార్చామని అన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలను విశ్లేషించి చికిత్సలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి నిపుణులైన వైద్యుల ద్వారా వారికి చికిత్స చేయించడంతో పాటు ఔషధాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సంజీవని సేవల్ని సమర్థంగా వినియోగించుకోవాలని సీఎం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కుప్పం నియోజకవర్గంలో 80 వేల మంది హెల్త్ రికార్డులను తయారు చేశామని ఆయన వెల్లడించారు.

### ఆరోగ్యపరమైన అంశాలపై స్కోరింగ్

వైద్య పరీక్షల అనంతరం వ్యక్తుల ఆరోగ్యానికి సంబంధించి స్కోరింగ్ కూడా ఇచ్చేలా చర్యలు చేపడతామని సీఎం వివరించారు. 42 రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. డయాబెటిస్, బీపీ, అనీమియా, హృద్రోగం, తదితర అనారోగ్య సమస్యలకు సంబంధిత వైద్య నిపుణులతో ఔషధాలను ఇప్పించటంతో పాటు ప్రజారోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని అన్నారు. త్వరలో వైద్య సలహాల కోసం ఏఐ డాక్టర్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డిజి నెర్వ్ సెంటర్ ద్వారా ఒక్క క్లిక్ తోనే వైద్యులు రోగులకు సంబంధించిన వివరాలన్నీ తెలుసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా నమోదు చేసిన తుమ్మిశి గ్రామస్థుల డిజిటల్ హెల్త్ రికార్డులను వారి ఆరోగ్య వివరాలను పరిశీలించిన ముఖ్యమంత్రి కొందరు అనీమియా లోపంతో బాధపడుతున్న మహిళలు, ఇతర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారితో ముఖాముఖి మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. వారికి మెరుగైన చికిత్స అందించటంతో పాటు వైద్య నిపుణుల సేవలు అందేలా చూడాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. తుమ్మిశి గ్రామంలో ఇటీవల గుండెపోటు తో మృతి చెందిన ఓ వ్యక్తి కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.3 లక్షల సాయాన్ని ముఖ్యమంత్రి ప్రకటించారు.

# గంగజాతర ముందే మొదలైంది!

- మాస్ జాతర పాట ఆవిష్కరణ
- కుప్పం కార్యకర్తల సమక్షంలో విడుదల చేసిన సీఎం చంద్రబాబు




కుప్పం (చైతన్యరథం): జనహితం కోసం యువనేత లోకేష్ పడ్డ ఆరాటంలోని భావోద్వేగ క్షణాల సమాహారంతో.. యువగళానికి మూడేళ్లు నిండిన సందర్భంగా, కుప్పం కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆదివారం అద్భుత మాస్ జాతర పాటను ఆవిష్కరించారు. మా కుప్పం గంగజాతర కోసమే ఈ పాట పుట్టిందని భావిస్తున్నాం అంటూ అక్కడి కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రామాయణంలో.. మారీచ, సుబాహుల నుండి యాగ రక్షణ చేయడానికి విశ్వామిత్ర మహర్షి వెంట శ్రీరాముడు వెళ్ళాడు. ఆకాశం నుండి రక్తాన్ని, మాంసాన్ని కురిపించి యజ్ఞకుండాన్ని అపవిత్రం చేయడానికి ప్రయత్నించిన మారీచుడిని సముద్రంలో పడిపోయేలా చేసి, సుబాహుడిని సంహరించి యజ్ఞాన్ని దిగ్విజయంగా పూర్తి చేయించి.. ఆశీస్సులుగా దివ్యాస్త్రాలు పొంది శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చారు.

నాడు రామాయణంలో అది జరిగితే.. ఐదేళ్లపాటు తిరుమల నుండి అమరావతి వరకు అపవిత్రం చేస్తూ, కుప్పం నుండి శ్రీకాకుళం వరకు విధ్వంసం సృష్టిస్తూ ప్రజలను హింసిస్తున్న పరిస్థితులలో.. యువగళమై ఎదురునిలిచి అడుగులు వేశారు యువనేత లోకేష్. పాదయాత్రలో దుర్మార్గులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, 'దారి ఇస్తే పాదయాత్ర.. లేదంటే దండయాత్ర' అంటూ ఆంధ్రాకు ధైర్యమై నిలిచారు. శత్రువు అసెంబ్లీలో అడుగుపెట్టడానికే భయపడేలా విజయం సాధించి రాష్ట్రాన్ని రక్షించారు. గూగుల్ వంటి ప్రపంచ దిగ్గజాల నుండి దేశీయ మల్టీనేషనల్ కంపెనీల వరకు పెట్టుబడులను మన రాష్ట్రానికి తెస్తూ, యువత ఆశలను 'ఉద్యోగ అస్త్రాలుగా' మలుస్తున్నారు.

ఇవన్నీ వివరిస్తూ కట్టా సుధీర్ ఈ మాస్ జాతర పాటను రూపొందించారు. ఈ పాట వెనుక ఒక గొప్ప తపన ఉంది. ఎన్నికల ముందు 'ధూం ధాం' లాంటి 40కి పైగా పాటలను టీడీపీకి అందించిన కట్టా సుధీర్, తన తండ్రి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నా (తరువాత ఆయన కన్నుమూశారు).. ఖమ్మం దగ్గరి మధిర నుండి హైదరాబాద్ వెళ్లి, మనసు పెట్టి ఈ పాటను రికార్డ్ చేసి తన అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు.

# కేంద్ర బడ్జెట్.. ఏపీ భవిష్యత్‌కు దిక్సూచి

- సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా విధాన నిర్ణయాలు
- వికసిత్ భారత్ - విజన్ 2047 సాకారానికి బాటలు
- ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత బలం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం (చైతన్యరథం): వికసిత్ భారత్ - విజన్ 2047 సాకారానికి బాటలు వేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ భవిష్యత్‌కు స్పష్టమైన మార్గదర్శకంగా నిలుస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ భావనకు మరింత బలం చేకూర్చుతూ, యువశక్తి, నారీశక్తి, రైతులు, ఎస్సీ-ఎస్టీ-బీసీ వర్గాలు, దివ్యాంగులు, ఎంఎస్ఎంఈలు కేంద్రంగా రూపొందిన ఈ బడ్జెట్ దేశ ఆర్థిక ప్రయాణాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళుతుందన్నారు.

ద్రవ్యలోటును నియంత్రిస్తూ, మౌలిక వసతులు, పరిశ్రమలు, టెక్నాలజీ, పర్యావరణ పరిరక్షణ, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం భవిష్యత్ తరాలకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న విశ్వాసానికి ఈ బడ్జెట్ ఆలంబనగా నిలుస్తోందన్నారు.

**ఏపీకి ప్రయోజనాలు**

కేంద్ర బడ్జెట్-2026లో ఆంధ్రప్రదేశ్‌కు అనేక రంగాల్లో స్పష్టమైన అవకాశాలు లభించడం రాష్ట్ర అభివృద్ధికి శుభసూచకమని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజా మూలధన వ్యయానికి రూ.12.2 లక్షల కోట్ల కేటాయింపు, కొత్త ఫ్రైట్ కారిడార్లు, జాతీయ జలమార్గాల విస్తరణ, సముద్ర రవాణాకు ప్రోత్సాహం వంటి నిర్ణయాలు ఏపీ లాజిస్టిక్స్, పోర్ట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయన్నారు. విశాఖపట్నం-కాకినాడ పోర్ట్ కారిడార్‌ను ఆగ్నేయాసియా వాణిజ్యానికి ప్రధాన ద్వారంగా తీర్చిదిద్దే అవకాశాలు ఈ బడ్జెట్‌తో మరింత విస్తరించాయని చెప్పారు.

పోలవరం సాగునీటి ప్రాజెక్టుకు రూ.3,320 కోట్ల కేటాయింపు ద్వారా రాష్ట్ర వ్యవసాయం, నీటి భద్రతకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యం స్పష్టమైందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే లక్షలాది రైతులకు శాశ్వత సాగు, తాగునీటి భరోసా లభిస్తుందని తెలిపారు.

**పరిశ్రమలు, అరుదైన ఖనిజాలు, టెక్నాలజీకి ఊపిరి**

ఆంధ్రప్రదేశ్‌ను అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్) కారిడార్ రాష్ట్రంగా కేంద్ర బడ్జెట్‌లో స్పష్టంగా పేర్కొనడం చారిత్రాత్మక నిర్ణయమని పల్లా అన్నారు. మైనింగ్, ప్రాసెసింగ్, పరిశోధన, విలువ జోడింపు రంగాల్లో భారీ పెట్టుబడులకు ఇది దారి తీస్తుందన్నారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు మూడు కెమికల్ పార్కుల ఏర్పాటు, ప్లగ్ అండ్ ప్లే మోడల్‌లో పరిశ్రమలకు మౌలిక వసతులు కల్పించడం ఏపీకి పెద్ద అవకాశమన్నారు.

ఎలక్ట్రానిక్స్ భాగాల తయారీకి రూ.40 వేల కోట్ల కేటాయింపు, సెమీకండక్టర్ ఇండియా మిషన్ 2.0 ద్వారా పరికరాలు, మెటీరియల్స్ తయారీకి ప్రోత్సాహం ఇవ్వడం శ్రీసిటీ వంటి ఏపీ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లకు మేలు చేస్తుందన్నారు. టన్నెల్ బోరింగ్ యంత్రాలు, అత్యాధునిక అగ్నిమాపక పరికరాల దేశీయ తయారీ కూడా మౌలిక వసతుల రంగంలో స్వయం సమృద్ధిని పెంచుతుందన్నారు.

**బయోఫార్మా, హెల్త్‌కేర్, మెడికల్ ఎడ్యుకేషన్‌లో కొత్త దశ**

రూ.10 వేల కోట్లతో బయోఫార్మా శక్తి పథకం ప్రారంభించడం ద్వారా భారత్‌ను గ్లోబల్ బయోలాజిక్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగు



పడిందని పల్లా తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగానికి ఇది కొత్త ఊపునిస్తుందన్నారు. ప్రాంతీయ మెడికల్ విలువ పర్యాటక హబ్‌లు, మిత్ర వైద్య సిబ్బంది (అలైడ్ హెల్త్ ప్రొఫెషనల్స్) శిక్షణ ద్వారా ఏపీ హెల్త్‌కేర్ వర్క్‌ఫోర్స్‌కు ప్రపంచస్థాయి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

**పర్యాటకం, సేవారంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం**

అరకు లోయను పర్యావరణ అనుకూల పర్వత మార్గాలుగా, పులికాట్ సరస్సును బర్డ్ వాచింగ్ ట్రెయిల్స్‌తో అభివృద్ధి చేయడంపై బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి పెట్టడం స్థానిక ఉపాధి అవకాశాలను పెంచుతుందని పల్లా పేర్కొన్నారు. జాతీయ డెస్టినేషన్ డిజిటల్ నాలెడ్జ్ గ్రిడ్ ద్వారా పర్యాటక కంటెంట్ సృష్టి, డిజిటల్ టూరిజం ఉద్యోగాలు పెరుగుతాయన్నారు.

మత్స్యకార రంగంలో 500 రిజర్వాయర్లు, అమృత్ సరోవర్ల అభివృద్ధి, తీరప్రాంత మత్స్యకార వాల్యూచైన్‌లను బలోపేతం చేయడం ద్వారా దేశంలోనే అతిపెద్ద సముద్ర ఆహార ఎగుమతిదారైన ఆంధ్రప్రదేశ్‌కు మరింత మేలు జరుగుతుందన్నారు. కొబ్బరి, జీడిపప్పు, కోకో వంటి అధిక విలువ పంటలపై ప్రత్యేక కార్యక్రమాలు తీరప్రాంత రైతుల ఆదాయాన్ని పెంచుతాయని తెలిపారు.

**యువశక్తి, నారీశక్తి, ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం**

రూ.10 వేల కోట్ల ఎంఎస్ఎంఈ గ్రోత్ ఫండ్ ద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అండగా నిలవడం ఉపాధి కల్పనకు కీలకమని అన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల విస్తరణ, ఏవీజీసీ, గేమింగ్, డిజిటల్ కంటెంట్ రంగాల్లో అవకాశాలు భవిష్యత్ టెక్నాలజీలకు యువతను సిద్ధం చేస్తాయన్నారు. నారీశక్తి సాధికారత, దివ్యాంగులకు అనేక కార్యక్రమాలు సామాజిక సమానత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.

**మౌలిక వసతులు, నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక స్థిరత్వం**

టైర్-2, టైర్-3 నగరాల్లో సిటీ ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధికి ప్రతి నగరానికి ఐదేళ్లలో రూ.5,000 కోట్ల చొప్పున కేటాయింపులు విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం వంటి నగరాలను ఆర్థిక వృద్ధి కేంద్రాలుగా మార్చుతాయని తెలిపారు. రాష్ట్రాలకు రూ.25.43 లక్షల కోట్ల వనరుల బదిలీ, 16వ ఆర్థిక సంఘం ద్వారా స్థానిక సంస్థలు, విపత్తు నిర్వహణకు నిధులు జిల్లా స్థాయి పాలనను బలోపేతం చేస్తాయని అన్నారు.

**వికసిత్ భారత్ దిశగా ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర**

కేంద్ర బడ్జెట్--2026 కేవలం ఖర్చుల ప్రకటన కాదు, దేశ భవిష్యత్‌కు విధానపరమైన దిశానిర్దేశం చేసే పత్రంగా నిలుస్తుందని పల్లా స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్లు, బయోఫార్మా, ఏఐ, డేటా సెంటర్లు, పర్యాటకం, వ్యవసాయం అన్నింటినీ సమన్వయంగా ముందుకు తీసుకెళ్లే ఈ బడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్ దేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

---

## తీర రక్షక దళ సిబ్బందికి సీఎం చంద్రబాబు 50వ రైజింగ్ డే శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): భారత తీర రక్షక దళం సిబ్బందికి వారి 50వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. మన సముద్ర ప్రయోజనాలను కాపాడటం, తీరప్రాంత భద్రతలో వారి మొక్కవోని దీక్ష అభినందనీయమన్నారు. అదేవిధంగా అవసరమైన సమయాల్లో మానవతా సేవలో వారు చూపించే దృఢ నిబద్ధత ఎంతైనా ప్రశంసనీయమని ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### కల్తీనెయ్యి అంశాన్ని కప్పిపుచ్చుకునేందుకు..

# వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్

- నాడు కాసుల కక్కుర్తితో శ్రీవారికి జగన్ బ్యాచ్ అపచారం
- లడ్డు తయారీకి వాడిన కృత్రిమ నెయ్యిలో జంతు కొవ్వు అవశేషాలు వాస్తవం
- భక్తుల మనోభావాల పరిరక్షణలో రాజీ ప్రసక్తే లేదు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

తూర్పు నాయుడుపాలెం/ప్రకాశం (చైతన్యరథం): శ్రీవారి లడ్డు ప్రసాదం కల్తీ అంశాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. ఆదివారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మంత్రి మాట్లాడుతూ... కాసుల కక్కుర్తితో జగన్ అండ్ కో శ్రీ వారి ప్రసాదాన్ని కల్తీ చేశారని మండిపడ్డారు. లడ్డూ తయారీకి వాడిన కృత్రిమ నెయ్యిలో జంతు కొవ్వు అవశేషాలు ఉన్న మాట వాస్తవం. శ్రీవారి భక్తుల మనోభావాలు కాపాడడంలో మేం రాజీపడే ప్రసక్తే లేదు.



శ్రీ వారి ప్రసాదం కల్తీ చేయకపోతే నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ బ్యాంకు అకౌంట్ కి రూ.4 కోట్ల 60 లక్షలు ఎలా వచ్చాయి? కమీషన్లు తీసుకొని అర్హతలేని కంపెనీలకు నెయ్యి సరఫరా టెండర్లు ఇచ్చింది వాస్తవం కాదా? కోట్లాదిమంది భక్తుల ఇలవేల్పు అయిన శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసిన పాపం ఊరికే పోతుందా? జగన్ నీచ రాజకీయాల్ని ప్రజలు ఛీకొడుతున్నారని మంత్రి డోలా మండిపడ్డారు.

# పేదల సొంతింటి కలను నెరవేర్చేలా బడ్జెట్

## అమరావతికి కేటాయింపులు భేష్ - మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి(చైతన్యరథం): వికసిత్ భారత్‌ను శరవేగంగా ముందుకు నడిపించేలా.. దేశంలోని అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఆర్థిక సమస్యల నుంచి ఏపీని ఆదుకునేందుకు ఆపన్నహస్తం అందించేలా బడ్జెట్ కేటాయింపులు చేయడం హర్షణీయం. ప్రధానమంత్రి ఆవాసయోజన అర్బన్ పథకం ద్వారా



భారతదేశాన్ని డేటా హబ్‌గా మార్చడానికి ఈ బడ్జెట్ ఎంతో ఉపకరిస్తుంది. కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు రూ.3,320.39 కోట్లు కేటాయించి మన రాష్ట్ర రైతాంగం కలలను నెరవేర్చడానికి కేంద్రం పెద్దపీట వేసినట్లుగా భావించవచ్చు. అమరావతి రాజధాని అభివృద్ధికి ఏడీబీ నిధులు రూ.1,128.91 కోట్లను కేంద్రం కేటాయించింది. అమరావతి సమీకృత పట్టణా భివృద్ధి కోసం రూ.432.09 కోట్లు కేటాయించడం హర్షణీయం.

2026-27 బడ్జెట్‌లో ఏపీకి రూ.18,625 కోట్లు, ప్రధానమంత్రి ఆవాసయోజన రూరల్ పథకం ద్వారా రూ. 54,917 కోట్లు, ప్రధానమంత్రి ఆవాసయోజన 2.0 పథకం ద్వారా రూ.3,000 కోట్లు కేటాయించడం హర్షణీయం. రాష్ట్రంలో పేదవారి సొంతింటి కలలను నెరవేర్చడానికి కేంద్రం పెద్దపీట వేసిందని చెప్పడానికి ఇంతకంటే పెద్ద ఉదాహరణ అవసరం లేదు. ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు, డేటా సెంటర్లు పెట్టే సంస్థలకు ట్యాక్స్ హాలిడే వంటి విధానాలతో

రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి ఎన్‌డీబీ నుంచి రూ.350 కోట్ల రుణ సదుపాయం కల్పిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం స్వాగతనీయం. రూరల్ రోడ్ ప్రాజెక్టుల కోసం ఏఐఐబీ నుండి రూ.500 కోట్లు కేంద్రం కేటాయించింది. సేవారంగం విస్తరణతో వికసిత్ భారత్ సాధ్యం అని కేంద్ర బడ్జెట్ రుజువుచేస్తుంది. రాష్ట్రంలో మూడు హైస్పీడ్ రైల్ కారిడార్‌తో రైల్వే రంగంలో వేగం పెరుగుతుంది, రాష్ట్రంలో విలువైన బీచ్ శాండ్ వంటి అరుదైన ఖనిజాల వెలికి తీతతో రాష్ట్రానికి, కేంద్రానికి మంచి ఆదాయం వచ్చేలా బడ్జెట్ నిర్ణయాలు ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటు, కొబ్బరి, కోకో సాగులో రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్న నేపథ్యంలో వ్యవసాయ రంగానికి కూడా పెద్దపీఠ వేస్తున్న ఊతమందించేలా బడ్జెట్ ఉంది.

# ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర బడ్జెట్‌లో పెద్దపీట

- ఏపీ అభివృద్ధికి బలమైన పునాది
- కేంద్ర బడ్జెట్‌పై మంత్రి అచ్చెన్నాయుడు హర్షం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు



అమరావతి (చైతన్యరథం): కేంద్ర బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌లో దాని విస్తరణకు రూ.155.32 కోట్ల కేటాయింపులు చేయడం కేంద్ర ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ దేశ వ్యవసాయ రంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని ఆయన కొనియాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల ఆదాయం పెరగడంతోపాటు భూమి సారాన్ని కాపాడుకునే అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లాంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలకు ఈ కేటాయింపులు ఎంతో ఉపయోగకరంగా మారతాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ బడ్జెట్ బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో చిన్న, సన్నకారు రైతుల ఆదాయం పెంచే దిశగా కీలక నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయమన్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి కేంద్రంగా రూపొందిన ఈ బడ్జెట్ రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. రిజర్వాయర్లలో చేపల పెంపకం, మత్స్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గ్రామీణ ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని చెప్పారు. అలాగే పశు సంవర్ధకశాఖకు ప్రోత్సాహకాలు పెంచడం పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు.

**అధిక విలువ కలిగిన పంటలకు ప్రోత్సాహం**

వ్యవసాయ ఆదాయం పెంచేందుకు అధిక విలువ కలిగిన పంటలకు కేంద్రం ప్రోత్సాహం ఇవ్వడం దూరదృష్టితో తీసుకున్న నిర్ణయమని మంత్రి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో కొబ్బరి, గంధం వంటి పంటల సాగుకు ప్రోత్సాహం ఇవ్వడం దీర్ఘకాలికంగా రైతులకు లాభదాయకంగా మారుతుందని తెలిపారు. కొబ్బరి ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక ప్రోత్సాహక పథకం ప్రకటించడం, కాయలు కాయని పాతచెట్ల స్థానంలో కొత్త చెట్ల నాటకానికి సాయం అందించడం ద్వారా తోటల ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేశారు.

**ఎన్డీఏ ప్రభుత్వంలో ఏపీ అభివృద్ధి వేగం**

ఎన్డీఏ ప్రభుత్వంలో కేంద్రం, రాష్ట్రాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్న విశ్వాసాన్ని ఈ బడ్జెట్ మరింత బలపరుస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సమగ్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# చంద్రబాబు ప్రజాజీవితం తెరిచిన పుస్తకం

- చేయని తప్పుకు అక్రమ కేసులు పెట్టి వేధించిన జగన్
- నాడు రాజశేఖర్ రెడ్డి 26 ఎంక్వయిరీలు వేసి ఏం చేయలేకపోయారు
- చంద్రబాబు ముందు జగన్ కుప్పిగంతులు చెల్లవు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- స్కిల్ కేసులో సీఎం చంద్రబాబుకు ఈడీ క్లీన్‌చిట్‌పై మంత్రి హర్షం



అమరావతి (చైతన్యరథం): టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా జీవితం తెరిచిన పుస్తకమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. స్కిల్ కేసులో సీఎం చంద్రబాబుకు ఈడీ క్లీన్ ఇవ్వడం పట్ల ఆదివారం ఓ పత్రిక ప్రకటనలో మంత్రి డా.స్వామి హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు స్కిల్ కేసులో కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆనాడే చెప్పామని గుర్తుచేశారు. చేయని తప్పుకు చంద్రబాబునాయుడుపై కక్షతో జగన్ అక్రమ కేసులు పెట్టి వేధించారు. నాడు రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడుపై 26 ఎంక్వయిరీలు వేసి ఏం చేయలేకపోయారు. ఇక జగన్ ఎంత? చంద్రబాబు నాయుడు ముందు జగన్ కుప్పిగంతులు చెల్లవు. చంద్రబాబు నాయుడు ప్రజా జీవితం తెరిచిన పుస్తకమని, మచ్చలేని చంద్రుడు సీఎం చంద్రబాబు నాయుడని మంత్రి డా.స్వామి అన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- మంత్రి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 15 కుటుంబాలు



తూర్పునాయుడుపాలెం/ప్రకాశం (చైతన్యరథం): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం నాడు ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెంలో మంత్రి డా.స్వామి సమక్షంలో జిల్లాలోని మర్రిపూడి మండలం కాకర్ల గ్రామ పంచాయతీలోని శివరాయునిపేటకు చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి మంత్రి స్వామి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. 5 ఏళ్ల వైసీపీ పాలనంతా దోచుకోవడం, దాచుకోవడం తప్ప జగన్ అండ్ కో ప్రజలకు చేసిందేమీలేదు. నేడు సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం పరుగులు పెడుతుంది. సీఎం చంద్రబాబు నాయుడు పాలనపై నమ్మకంతో రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి టిడిపిలో చేరుతున్నారని మంత్రి స్వామి అన్నారు.

**వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారి వివరాలు**

1. కొవ్వూరి పెద్ద పుల్లయ్య, 2. కొవ్వూరి చిన్న పుల్లయ్య, 3. కొవ్వూరి వెంకటయ్య, 4. కొవ్వూరి కోటేశ్వరరావు, 5. కొవ్వూరి వరాల నాయుడు, 6. గంగిశెట్టి శ్రీను, 7. గంగిశెట్టి పెద్ద గురుస్వామి, 8. గంగిశెట్టి చిన్న గురుస్వామి, 9. గంగిశెట్టి కిరణ్, 10. గంగిశెట్టి తిరుపతి నాయుడు, 11. గంగిశెట్టి నరసింహారావు, 12. ముకుంద ఏడుకొండలు, 13. ముకుంద తిరుపతి స్వామి, 14. ముకుంద రవి, 15. చనికల బ్రహ్మయ్య

వారంతా టీడీపీ నాయకులు నల్లగొండ కాసయ్య, వేమారెడ్డి రామిరెడ్డి, శివ నారాయణ(సర్పంచ్), బ్రహ్మయ్య (గ్రామ పార్టీ అధ్యక్షుడు), గంగిశెట్టి శ్రీనివాసరావు, ముకుంద రామయ్య, దాసరి బంగారయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

# రాష్ట్రంలో అశాంతికి వైసీపీ కుట్రలు

- అసహ్యించుకునేలా అంబటి మాటలు
- రౌడీలతో పార్టీని ఎంతకాలం నడుపుతారు
- జగన్‌పై ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ధ్వజం

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి, దేశంలో అత్యంత సీనియర్ నాయకుడు చంద్రబాబును వైసీపీ నేత అంబటి రాంబాబు సభ్యత మరిచి బూతులు తిట్టడాన్ని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య తీవ్రంగా ఖండించారు. కెమెరాల సాక్షిగా అంబటి రాంబాబు తిట్టిన బూతులు రికార్డు అయ్యాయి.ఆమాటలు చూసి సభ్య సమాజం నిర్ఘాంతపోయింది. ఆవేశంలో నోరు జారానని అంబటి రాంబాబు చెప్పినా కొంతవరకు అర్థం ఉండేది.



కానీ, చేసిన తప్పును సమర్థించుకునే విధంగా మాట్లాడడం అతని మనస్తత్వాన్ని తెలియజేస్తోంది.వైసీపీకి చెందిన కొందరు నేతలు గత కొంతకాలంగా అడ్డూ అదుపు లేకుండా మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారు. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసి పెట్టుబడులు రాకుండా చూడాలని కుట్ర పన్నుతున్నారు. వాటిని ప్రోత్సహించే విధంగా జగన్‌రెడ్డి ప్రవర్తించడం అత్యంత దారుణం. గూండాలు, రౌడీలు, సంఘ విద్రోహ శక్తులతో ఓ రాజకీయ పార్టీని ఎక్కువ కాలం నడపడం ప్రజాస్వామ్యంలో అసాధ్యం. ఆ విషయాన్ని ఆయన గుర్తించుకోవాలని హితవుపలికారు.

## వైసీపీ అసత్య ప్రచారాలను

# బలంగా తిప్పికొట్టాలి

- కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి
- రొద్దం మండల తెలుగు యువతతో సమీక్షలో మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను సోషల్ మీడియా వేదికగానూ, గ్రామస్థాయిలోనూ గట్టిగా తిప్పికొట్టాలని రాష్ట్ర మంత్రి సవిత పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రొద్దం మండల తెలుగు యువతతో ఆదివారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 18 నెలల్లోనే రాష్ట్రంలో, నియోజకవర్గంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని, వచ్చే మూడు సంవత్సరాల్లో మరింత అభివృద్ధికి బలమైన పునాదులు వేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి జరుగుతుండటాన్ని ఓర్చుకోలేని వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. గత వైసీపీ పాలనలో ప్రశ్నిస్తే కేసులు పెట్టే పరిస్థితి ఉండేదని, అయితే మన నాయకుడు చంద్రబాబు నాయుడు కక్షసాధింపు రాజకీయాలకు దూరంగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. జగన్‌కు ఇచ్చిన ఒక్క అవకాశంతోనే రాష్ట్రాన్ని 20 సంవత్సరాలు వెనక్కి నెట్టారని ఆరోపించారు.

తెలుగుదేశం పార్టీ యువతే పార్టీకి బలమైన పునాది అని మంత్రి సవిత పేర్కొన్నారు. యువనేత నారా లోకేష్ నేతృత్వంలో తెలుగు యువత రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేస్తోందని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార దిశగా కృషి చేయాలని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు సముచిత ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. దమ్ముంటే వైసీపీ నాయకులు అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. యువకులకు యువనేత నారా లోకేష్ ఒక్క మాట ఆదేశిస్తే వైసీపీ నాయకులు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎకానమీని పరుగులు పెట్టించేలా కేంద్ర బడ్జెట్

- దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు బాటలు
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



అమరావతి(చైతన్యరథం): భారతదేశాన్ని స్థిరమైన, బలమైన ఆర్థిక శక్తిగా ముందుకు తీసుకెళ్లే దిశగా 2026-27 కేంద్ర బడ్జెట్ దేశానికి స్పష్టమైన దారి చూపిస్తుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆర్థిక పురోగతి సాధించేలా 2026-27 కేంద్ర బడ్జెట్‌ని ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ, అలానే 9వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలిపారు. పారిశ్రామిక రంగానికి ఊతం ఇచ్చేలా, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి దోహద పడేలా కేంద్ర బడ్జెట్ ఉందని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెం దుతున్న ఆర్థిక వ్యవస్థ ఆకాంక్షలను నెరవేర్చే విధంగా లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. ఇదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధిం చి చేసిన కీలక ప్రకటనలకు కూడా రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు.. హైదరా బాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, బెంగళూరు-చెన్నైల ద్వారా రాష్ట్రం లబ్ధి పొందుతుంది. ఎకానమీపై ప్రభావం ఉంటుం ది. ఇంటిగ్రల్ సెమీ కండక్టర్ మిషన్ 2.0 పథకాన్ని రూ.40,000 కోట్లకు విస్తరించడం గొప్ప పరిణామం. దీని ద్వారా రాష్ట్రానికి కూడా లబ్ధి చేకూరుతుంది. వస్త్ర (టెక్స్‌టైల్) రంగానికి మద్దతు పలికేలా క్లస్టర్ల ఏర్పాటు మంచి పరిణామం. దీనిద్వారా నేత కార్మికులకు, కళాకారులకు ఉపాధి లభిస్తుంది. డాటా సెంటర్లు ఏర్పాటుకు 2047 వరకు పన్ను మినహాయింపులు. ఇది ఈ రంగానికి ఎంతో ప్రోత్సాహమిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ లో కొబ్బరి, కోకో, జీడిపప్పు వంటి వాణిజ్య పంటలకు ప్రోత్సా హం ఇవ్వడం రాష్ట్ర రైతులకు పెద్ద ఊరట కలిగించే నిర్ణయం. ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున రైతులు కొబ్బరి, కోకో, జీడిపప్పు పంటలను సాగు చేస్తున్నారు. రైతుల ఆదాయం మెరుగుపడే దిశ గా ఇది కీలక అడుగు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఆంధ్రప్రదేశ్‌తో సహా 5 రాష్ట్రాల్లో ఖనిజాల వెతికితీత పథకం కూడా రాష్ట్రానికి మేలు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఖనిజ వనరులను దేశాభివృ ద్ధికి వినియోగించుకునే దిశగా ఇది ముఖ్యమైన నిర్ణయమని తెలిపారు. పూర్వోదయ పథకంలో భాగంగా భవిష్యత్‌లో రాష్ట్రానికి లబ్ధి జరిగేలా నిర్ణయాలు ఉంటాయని అభిప్రాయ పడ్డారు.

---

స్కిల్ కేసులో క్లీన్‌చిట్..

## జగన్‌రెడ్డికి చెంపపెట్టు

- చంద్రబాబు నిజాయితీకి నిదర్శనం
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి(చైతన్యరథం): స్కిల్ కేసులో సీఎం చంద్రబాబుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధంలేదని ఈడీ చార్జ్‌షీట్‌లో స్పష్టం చేయడం ఆయన నిజాయితీకి, స్వచ్ఛమైన రాజకీయాలకు నిదర్శన మని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



కక్ష రాజకీయాలకు భయపడని, చట్టా నికి గౌరవం ఇచ్చే ధైర్యవంతమైన నాయకత్వం చంద్రబాబుది. దేశ భవి ష్యత్తు కోసం యువతను కేంద్రంగా పెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ ఆలో చన ఆయన దూరదృష్టికి నిదర్శనం. ఏపీ సీఐడీ, ఈడీ రెండూ సీఎం చంద్ర బాబు పాత్ర లేదని తేల్చడం ఆయన పరిపాలనా పారదర్శ కతకు నిదర్శ నం. విజయవాడ ఏసీబీకోర్టులో ఆయనపై కేసువిత్‌డ్రా కావడం... జగన్‌రెడ్డి తప్పుడు ఆరోపణలకు చెంపపెట్టు. నిజాయితీ, విలువ లతో రాజకీయాలు చేయవచ్చని నిరూపించిన అరుదైన నాయ కుడు సీఎం చంద్రబాబు. కక్ష సాధింపు రాజకీయాలు చేసినా చివరికి గెలిచేది సత్యమే.. అదే సీఎం చంద్రబాబు మార్గం. రాష్ట్రా భివృద్ధే లక్ష్యంగా, వ్యక్తిగత దూషణలకు లొంగకుండా ముందుకు నడిచే నేత ఆయన. సీఎం చంద్రబాబు నాయ కత్వంపై ప్రజల నమ్మకాన్ని ఈడీ క్లీన్‌చిట్ మరింత బలపరిచిందని తెలిపారు.

---

స్కిల్ కేసులో

## జగన్ కుతంత్రం బట్టబయలు

- చంద్రబాబుకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు(చైతన్యరథం): దొడ్డిపట్ల గ్రామంలో రూ.60 లక్షలతో పలు అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల రామానాయుడు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ కేసులో చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్ అత్యంత సంతోషకరం. ఈ క్లీన్‌చిట్ జగన్మోహన్‌రెడ్డికి చెంపపెట్టు. ఈడీ క్లీన్ చిట్‌తో జగన్మో హన్‌రెడ్డి కుట్రలు, కుతంత్రాలు బట్టబయలయ్యాయి. నేరం చేయ ని పాపానికి చంద్రబాబును 53 రోజులు జైల్లో నిర్బంధించి జగన్ పైశాచికానందంపొందాడు. న్యాయం, ధర్మాన్ని నమ్ముకు న్న చంద్రబాబు నిజాయితీ నేడు ఈడీ క్లీన్ చిట్‌తో స్పష్టమైంది. చంద్రబాబుకు జగన్ అవినీతి మచ్చ అంటించాలనుకుంటే అది పూర్తిగా అవివేకమే. చంద్రబాబు జోలికి వచ్చి తన గొయ్యి తానే తవ్వు కున్న మూర్ఖుడు జగన్. ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని, స్కిల్ కేసుతో చంద్రబాబుకు సంబంధం లేదని ఈడీ స్పష్టంచేసింది. చంద్రబాబు కు జగన్ బహిరంగ క్షమాపణలుచెప్పాలి.స్కిల్ కేసులో చంద్రబాబు గురించి తప్పుడు వాగుడు వాగిన వైసీపీ నేతలంతా క్షమాపణలు చెప్పాలి. నిజాయితీపరులను ఇబ్బంది పెడితే ఏం జరుగుతుందో 2024 ఎన్నికల ఫలితాలే నిలువెత్తు సాక్ష్యమని తెలిపారు.



---

## వైసీపీ నేతలు భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు

- కల్తీ నెయ్యితో కోట్ల రూపాయలు మెక్కారు
- తిరుమల పవిత్రతను కాపాడటానికి ప్రభుత్వం కృషి
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు(చైతన్యరథం): మాధవ సేవే మానవ సేవ, మానవ సేవే మాధవసేవ అనే నినాదాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించి అమలు చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. దేవదేవుని సంస్కృతి, సాంప్రదాయాలు, తిరుమల ప్రసాదాలను సైతం వ్యాపారమయం చేసిన వైసీపీ నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ కూటమి నాయకుల ఆధ్వర్యంలో నెల్లూరు రంగనాథస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుమల పవిత్రత గురించి దేవుని ఆచార వ్యవహారాలు ప్రసాదాల గురించి పదేపదే చర్చకు రావ డం దురదృష్టకరమన్నారు. తప్పులు చేస్తూ ఎదుటి వారిపై నింద లు మోపే కుసంస్కృతి వైసీపీది. గత 18 మాసాలుగా జరుగు తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక వికృత రాజకీయ క్రీడను ప్రతిపక్ష పార్టీ ప్రారంభించిం దని ధ్వజమెత్తారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. తిరుమల లడ్డు ప్రసాదం లో కల్తీ నెయ్యి వాడలేదని వారికి వారే క్లీన్ చిట్ ఇచ్చుకుంటున్నా రని ఎద్దేవా చేశారు. సిట్ పూర్తిస్థాయి నివేదిక సమర్పించక ముందే వారే విపరీత భూషణం చేస్తున్నారు. నెయ్యి సరఫరా చేసే కాంటాక్ట్‌ను తమ దగాకోరు సంస్థలకు కట్టబెట్టడానికి టెండర్ నిబంధనలను అన్నింటిని మార్చేసి కల్తీ జరగడానికి ఆజ్యం పోసిన గత ప్రభుత్వ నిర్వాకాలను ప్రజలు గమనించాలని కోరారు. అనర్హులకు టెండర్ దాఖలకు అవ కాశం కల్పించ డానికి టీటీడీ చైర్మన్ పీఏకు కోట్ల నిధులు అందచేస్తే.. మిగిలిన పెద్ద నాయ కులు ఏ మేరకు దోపిడీ చేశారో అర్థం అవుతుం దని తెలిపారు.

### సభ్యసమాజం మాట్లాడే భాషేనా అది..

అదేవిధంగా రాజకీయాలలో వాడకూడని భాష ఉపయోగి స్తూ ముఖ్యమంత్రిని అనరాని మాటలు అంటున్న వైకాపా నాయకుల మాటలను సభ్య సమాజం ఆమోదించదన్నారు. సంస్థాగతంగా బలంగా ఉన్న టీడీపీలోని రెండు కోట్ల మంది సభ్యులు ఒకేసారి గోవిందా గోవిందా అని నామస్మరణ చేస్తే ప్రతిపక్షం నామరూపాలు లేకుండా పోతుందని హెచ్చరించారు. సభ్యత సంస్కారం లేని జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసీపీ పనిచేస్తుందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడడానికి అహరహం ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించే దిశగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ, జిల్లా టీడీపీ అధ్యక్షులు బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఇన్‌చా ర్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు గిరిధర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, కూటమి నాయకులు సుధా కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

## గ్రూప్ 2లో ఉద్యోగానికి ఎంపిక

### యువకుడికి మంత్రి జనార్దన్‌రెడ్డి అభినందన

బనగానపల్లె(చైతన్యరథం): కష్టపడి చదివితే తాము అనుకున్న స్థానానికి చేరుకోగలిగే శక్తి యువతకు ఉందని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. కోవెలకుంట్లకు చెందిన నాగేంద్ర బాబు గ్రూప్ 2కు ఎంపికైన క్రమంలో వారి కుటుంబసభ్యులతో బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంతో కష్టపడి చదివి ప్రభుత్వ కొలువు కు ఎంపికైన నాగేంద్రబాబును ఈ సందర్భంగా మంత్రి ప్రత్యే కంగా అభినందించారు. ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితా ల్లో నాగేంద్రబాబు తన ప్రతిభతో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుకు ఎంపిక కావడం ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. నాగేంద్రబాబు స్ఫూర్తితో కోవెలకుంట్ల మండల విద్యార్థులు, యువత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కుమారుడికి అండగా నిలిచిన కుటుంబసభ్యులను అభినందించారు.. సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన యువత కష్టపడి చదివితే ఉన్నత స్థానాలను అందుకోవచ్చని నాగేంద్రబాబు ప్రత్యక్షంగా నిరూపించారని ప్రశంసించారు.




### ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు. అధికారులతో అక్కడిక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు.

# కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం

- అమరావతికి ఊతం అభినందనీయం
- ఆర్‌అండ్‌బీ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి



అమరావతి(చైతన్యరథం): కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇచ్చారని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు దాదాపు రూ. 1560 కోట్లు కేటాయింపులతో అమరావతికి ఊతం అందివ్వడం అభినందనీయం. పోలవరం ప్రాజెక్టుకు రూ.3320 కోట్లు కేటా యింపులతో సాగునీటి రంగానికి కల్పిస్తున్న ప్రాధాన్యం ఇచ్చారు. రహదారులు, వంతెనల పునఃనిర్మాణం కోసం రూ.350 కోట్లు కేటాయింపులతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట పీశారు. గ్రామీణ రహదారి ప్రాజెక్టులకు రూ.500.99 కోట్లు - పట్టణాల్లో తాగునీరు, మురుగు నీటిపారుదల నిర్వహణ కు రూ.800 కోట్లు కేటాయించడం సంతోషకరం. ఏపీలో ప్రకృ తి వ్యవసాయ ప్రోత్సాహానికి రూ.155.32 కోట్లు కేటాయించడం హర్షణీయం. లి దేశవ్యాప్తంగా 5 రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్ కారిడార్ ఏర్పాటు రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి కీలకంగా మారనుం ది. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడా ర్ల వల్ల ఏపీ గుండా రవాణా వ్యవస్థ విప్లవాత్మకంగా మారుతుంది. 2047 వరకు డేటా సెంటర్లకు 'ట్యాక్స్ హాలిడే' ప్రకటించడం విశాఖలో ఐటీ రంగానికి కొత్త ఊపునిస్తుంది. ట్యాక్స్ హాలిడే వల్ల క్లౌడ్ సర్వీసెస్ సంస్థలు ఏపీ వైపు చూసే అవకాశం ఉంది. వచ్చే ఐదేళ్లలో 20 కొత్త జలమార్గాలు, కోస్టల్ కార్గో ప్రమోషన్ స్కీమ్ తీర ప్రాంత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయ నుంది. ఆధునిక రవాణా అవసరాల కోసం సి-ప్లేషన్ల ఏర్పాటుకు కేంద్రం ఇచ్చే సాయం తీర ప్రాంత అభివృద్ధికి దోహదపడనుంది. కొత్తగా ఏర్పాటు చేసే డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ వల్ల రాష్ట్ర విమానయాన రంగం ఎదుగుదలలో తోడ్పాటు అందనుంది. కార్గో అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ద్వారా లాజిస్టిక్స్ ఖర్చు తగ్గి వాణిజ్యం మెరుగుపడుతుందని తెలిపారు.

# బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు

- పోలవరానికి రూ.3,320.39 కోట్లు
- అమరావతి అభివృద్ధికి రూ.1,561 కోట్లు
- పర్యాటక రంగానికి పెద్దపీట
- మంత్రి కందుల దుర్గేష్ హర్షం



అమరావతి(చైతన్యరథం): కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారా మన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చారిత్రాత్మకమని, ఇది దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మార్చే దిశగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఈ బడ్జెట్ ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యాటక శాఖ మంత్రిగా ఈ రంగంపై కేంద్రం చూపిన చొరవను ప్రత్యేకంగా అభినందించారు. కేంద్ర బడ్జెట్‌లో పర్యాటక రంగానికి పెద్దపీట వేయడం అత్యంత సంతోషదాయకమని తెలిపారు. రాష్ట్ర పర్యాటక రంగానికి ఇప్పటికే కేంద్రం సుమారు రూ.450 కోట్ల నిధులతో సహకరించిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ఏపీకి మరిన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక ప్రాజెక్టులు రావడంతో పాటు, విశేషంగా నిధులు మంజూరవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి కేంద్రం ప్రకటించిన నిధుల వివరా లను ప్రస్తావించారు. ఏపీకి కీలకంగా మారే పోలవరం ప్రాజెక్టుకు రూ.3,320.39 కోట్లు, అమరావతి రాజధాని అభివృద్ధికి రూ. 1,128.91 కోట్లు, అమరావతి సమీకృత పట్టణాభివృద్ధి రూ. 432.09 కోట్లు, గ్రామీణ రహదారి ప్రాజెక్టులకు రూ.500.99 కోట్లు, పట్టణ తాగునీరు, మురుగు నీటి నిర్వహణకు రూ. 800.00 కోట్లు, రహదారులు, వంతెనల పునర్నిర్మాణానికి రూ. 350.00 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ.155.32 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనపై బడ్జెట్ పూర్తి దృష్టి సారించిందని తెలిపారు. హై స్పీడ్ కారిడార్లు, మౌలికవసతుల కల్పనలో దేశం అగ్రగామిగా నిలిచేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూనే, టెక్నాలజీని సామాన్యుడికి చేరువ చేయడం హర్షణీయమన్నారు. ఈ బడ్జెట్ ద్వారా సంక్రమించిన నిధులను సమర్ధవంతంగా వినియోగించుకుని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని స్పష్టం చేశారు.

## భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలి

**- గ్రూప్-1 ఫలితాల్లో ఆర్టీఓగా ఎంపికైన సంతోషినికి మండలి విప్ వేపాడ అభినందనలు**

విశాఖపట్నం (చైతన్యరథం): ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో ప్రాంతీయ రవాణాశాఖ అధికారి (ఆర్టీఓ)గా ఎంపికైన లగుడు (గ(ట్రెడ్డి) సంతోషిని శాసనమండలి ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు ఆదివారం అభినందించారు. తన ను మర్యాదపూర్వకంగా కలిసిన సంతోషినిని ఆయన శాలువాతో సత్కరించారు. ఈ సందర్భం గా వేపాడ మాట్లాడుతూ.. సంతోషిని విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శమని కొని యాడారు. ఉద్యోగ విధుల్లో ప్రజల మనసులను చూరగొనాలని, భవిష్యత్తులో ఐఏఎస్ వంటి ఉన్నత శిఖరాలను అధిరోహించి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

దొండపూడికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గ(ట్రెడ్డి గోపి సహకారంతో, సంతోషిని పట్టుదలతో శ్రమించి వరుసవిజయాలు సాధించారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆమె, ఇటీవల గ్రూప్-2లో ఏఎస్ఓగా, తాజాగా గ్రూప్-1లో ఆర్టీఓగా ఎంపికై సత్తా చాటారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి, ఉద్యోగం చేస్తూనే ఉన్నత స్థాయికి ఎదిగిన ఆమె కృషిని డాక్టర్ వేపాడ ప్రత్యేకంగా ప్రశంసించారు



# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బడ్జెట్‌లో పెద్దపీట

- మినరల్ వెలికితీతకు ప్రాధాన్యం అతిపెద్ద నిర్ణయం
- అమరావతి, పోలవరానికి నిధులతో పనులు వేగవంతం
- ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం, యువత శిక్షణకు ప్రాధాన్యం
- గనులు, భూగర్భవనరుల మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి(చైతన్యరథం): క్రిటికల్ మినరల్స్ వెలికితీతకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఏపీని దేశ ముఖచిత్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు మంచి అవకాశమని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో మైనింగ్ సహా ప్రాసెసింగ్, వేల్యూ యాడెడ్ పరిశ్రమల ఏర్పా టుకు కీలకమైన అడుగు పడినట్లే. రాష్ట్రంలో సువిశాలమైన సముద్ర తీరం వెంబడి అత్యంత విలువైన వనరులు అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాన్ని దేశా నికి రోల్ మోడల్‌గా చూపే అవకాశం కలుగు తుంది. సెమీ కండక్టర్ ఇండియా మిషన్ 2.0 కోసం ఏకంగా రూ.40వేల కోట్ల కేటా యింపు భారత్‌ను సెమీ కండక్టర్ల తయారీకి హబ్‌గా మార్చనుంది. విశాఖ, తిరుపతి, శ్రీకాకుళం లాంటి ప్రాంతాల్లో చిప్ సంబంధిత పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నాయని తెలిపారు.

**అమరావతికి నిధులు హర్షణీయం**

ఆంధ్రప్రదేశ్ ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ఏడీబీ ద్వారా రూ.1,128.91 కోట్లు, జపాన్ నిధులతో రూ.432 కోట్లు కేటా యించడం శుభపరిణామం. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు రూ.3,320.39 కోట్లు కేటాయించడం సంతోషకరం. రాష్ట్రంలో రోడ్లు, మురుగునీటి నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం, వంతెనల నిర్మాణం లాంటి కీలక రంగాలకు భారీగా నిధుల కేటాయింపు ద్వారా కూటమి పాలనలో రాష్ట్ర సర్వతోముఖాభి వృద్ధికి మార్గం సుగమమైనట్లే. రాష్ట్రానికి పెట్టుబడులు తీసు కొచ్చి, పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకా శాలు కల్పించాలనే ప్రభుత్వ సంకల్పానికి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు సానుకూలంగా ఉన్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే 25 పాలసీలు తీసుకుని స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానంలో ముందుకు వెళ్తున్నాం.ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడంతో పాటుగా, ICAI, ICSI, ICMAI వంటి ప్రఖ్యాత సంస్థల ద్వారా యువతకు శిక్షణ అందించేలా ప్రత్యేక మైన కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా చిన్న ప్రాంతాల్లో కూడా పారిశ్రామిక ప్రొఫెష నల్స్ తయారీకి పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు.

## వికసిత భారత్ లక్ష్యానికి దిశానిర్దేశం

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థికాభివృద్ధికి దిశానిర్దేశం చేసే విధంగా ఉంది. ఉపాధి, యువత భవిష్యత్తుపై స్పష్టమైన దృష్టితో ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా ఉంది. మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, రవాణా రంగానికి పెద్దపీట వేయడం వల్ల దేశవ్యాప్తంగా కనెక్టివిటీ మరింత మెరుగుపడు తుంది. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు ప్రోత్సా హం, ఉపాధి సృష్టి, యువత నైపుణ్యాభివృద్ధికి ఈ బడ్జెట్ దోహదపడుతుందన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం సహకారం పెంచేలా బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాలు అభినందనీయం.

## గ్రూప్ 1 ఉద్యోగం సాధించిన యువతికి మంత్రి డోలా అభినందనలు



కొండపి (చైతన్యరథం): గ్రూప్ 1 ఫలితాల్లో సాంఘిక సంక్షేమ శాఖ అధికారినిగా ఎంపికైన ప్రకాశం జిల్లా కొత్తపట్నం గ్రామానికి చెందిన బేతాల శృతిని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అభినందించారు. గ్రూప్1 ఫలితాల్లో విజయం సాధించిన బేతాల శ్రీనివాసరావు కుమార్తె శృతి ఆదివారం తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యా దపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా శృతిని మంత్రి అభినం దించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. శృతి అకుంఠిత దీక్ష, కృషి, పట్టుదల వల్లే విజయం విజయం సాధించిందని పేర్కొన్నారు. శృతి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## దిగజారి మాట్లాడటం సరికాదు

**ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్**



విజయవాడ(చైతన్యరథం): హుందాగా ఉండవలసిన నాయకులు సహనం కోల్పోయి మాట్లాడడం సరికాదని ఎస్సీ కమిషన్‌చైర్మన్ కె.ఎస్.జవహర్ ఒక ప్రకటనలో ఖండించారు. రాజకీయ నాయకులు ఆదర్శంగా ఉండాలి కానీ దిగజారి మాట్లాడటం సరికాదు. ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మిగిలిపోతుంది. ప్రజలు ఈ భాషను పూర్తిగా వ్యతిరేకించే పరిస్థితి ఉంది. ముఖ్య మంత్రిపై ఈ రకమైన పదజాలం వాడటం తప్పు. ఇది పూర్తిగా నిస్పృహతో కూడుకున్న వ్యాఖ్యలుగా చెప్పవచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాజకీయాలను రక్షించు బాధ్యతను తీసుకోవలసిన అవసరం ఉంది. భవిష్యత్తులో ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రజాస్వామ్యం ఇలాంటి ప్రవర్తన వల్ల ప్రమాదంలో పడుతుంది.

## అంబటి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

**ఎమ్మెల్యే బొండా ఉమ**



విజయవాడ(చైతన్యరథం): అంబటి రాంబాబు సభ్యసమాజం తలదించుకునే విధంగా ప్రవర్తించారని ఎమ్మెల్యే బొండా ఉమ మండిపడ్డారు. వైసీపీ సంస్కృతి ఏమిటో ఆయన మాటలు చెబుతున్నాయి. అంతటి నీచమైన భాషని ఒక ముఖ్యమంత్రి మీద వాడారు. సీనియర్ రాజకీయ నాయకుడి మీద ప్రయోగించాడు. వారికి ఈ సమాజం మీద ఏ మాత్రం బాధ్యత లేదని అర్థమౌతోంది. జుగుప్సాకరమైన రాజకీయాలకు తెరలేపారు. వైసీపీ నీచ రాజకీయాలకు పెట్టింది పేరు. చంద్రబాబు, ప్రజలకు వైసీపీ నాయకులు, జగన్ క్షమాపణ చెప్పాలి. భవిష్యత్తులో ఇలాంటి భాషని మేము వాడమని ప్రకటన ఇవ్వాలి. ఎవరైనా ఇలాంటి భాష వాడితే వారిమీద చర్యలు తీసుకోవాలని కోరారు.

# వికసిత సంకల్పం... యువశక్తి ప్రేరేపితం

- ఆర్థిక వృద్ధి, భవిష్యత్ లక్ష్యాలను ఆవిష్కరించిన కేంద్ర బడ్జెట్
- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఊతం ఇచ్చే బడ్జెట్
- ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు
- వరుసగా 9వ బడ్జెట్ ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించిన నిర్మలా సీతారామన్‌కి అభినందనలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి (చైతన్యరథం): దేశంలో యువశక్తిని మేల్కొల్పాలి.. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి.. మౌలిక ప్రగతికి బాటలు వేయడం ద్వారా 2047 నాటికి దేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలపాలన్న బలమైన సంకల్పం... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో ప్రస్ఫుటమవుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వికసిత భారత్ లక్ష్యాలు సాధించేందుకు ఎలాంటి సంస్కరణలను అమలు చేయాలి... ఆ లక్ష్యం వైపు ప్రజలను ఎలా అడుగుల వేయించాలి... యువశక్తిని ప్రేరేపిస్తూ దేశాన్ని ఎలా ముందుకు నడిపించాలనే దృక్పథం 2026-2027 కేంద్రం బడ్జెట్‌లో ప్రతిబింబించిందన్నారు. వరుసగా 9వసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా చరిత్ర కెక్కిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కి అభినందనలు తెలుపుతున్నానన్నారు. పార్లమెంటులో ఆదివారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పవన్ స్పందించారు. సంస్కరణలే దేశ ఆర్థిక ప్రగతికి మూలాలు అన్న సూత్రాన్ని ముందుకు తీసుకువెళ్తూ ఆమె ప్రవేశపెట్టిన ప్రతి బడ్జెట్ దేశాన్ని స్థిరమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతూ వచ్చిందన్నారు. ప్రపంచం మొత్తం మాంద్యం వైపు అడుగులు వేస్తున్న సమయంలోనూ భారత దేశం తన సత్తా ఏంటో నిరూపించుకుంది. సంస్కరణలు, సంక్షోభ నివారణ, మౌలిక ప్రగతి, దేశ భద్రత, రైతు సంక్షేమం, వికసిత గ్రామీణ భారతం, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలకు పెద్ద పీట వేసిన 2026-2027 బడ్జెట్ ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. ఆపరేషన్ సిందూర్ ద్వారా మన రక్షణ బలం ఏంటో ప్రత్యర్థులకు చాటిన మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ఈసారి బడ్జెట్ లో రక్షణ రంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చింది. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన రూ. 53.47 లక్షల కోట్ల బడ్జెట్ లో రూ. 7.84 లక్షల కోట్లు రక్షణ రంగానికి కేటాయించడం ద్వారా దేశ రక్షణకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో చెప్పకనే చెప్పారు. బోర్డర్ సెక్యూరిటీతోపాటు దేశ అంతర్గత భద్రతకూ ప్రాధాన్యత ఇస్తూ ఈ సారి హోంశాఖకు రూ. 2.55 లక్షల కోట్లు కేంద్రం కేటాయించింది. సరిహద్దు భద్రత, అంతర్గత శాంతి భద్రతలు బలంగా ఉన్నప్పుడే దేశం ఆర్థికంగానూ దూసుకుపోతుందన్న సూత్రాన్ని ఇక్కడ అమలులో చూపారు. రక్షణ రంగం తర్వాత రవాణా రంగానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. హైస్పీడ్ కారిడార్లతో దేశంలోని ప్రాంతాల మధ్య అంతరాలు తగ్గించడం, రవాణా రంగానికి ఊతమివ్వడానికి ఈ నిర్ణయం తీసుకున్నారని పవన్ తెలిపారు.

**రాష్ట్ర ప్రగతికి చోదక శక్తిలా..**

రూ. 10 వేల కోట్ల ఎంఎస్ఎంఈ గ్రోత్ ఫండ్, పట్టణాల్లో చేపట్టిన కార్పొరేట్ మిత్రలు, ప్రజలకు ఈజ్ ఆఫ్ లివింగ్, వ్యాపారవేత్తలకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటివి దేశంతోపాటు రాష్ట్ర ప్రగతికి చోదక శక్తిలా ఉపయోగపడతాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఇది మద్దతునిస్తుంది. రూ. 1.40 లక్షల కోట్ల వ్యవసాయ బడ్జెట్ రైతు సాధికారత దిశగా అడుగులు వేయడానికి ఉపయోగపడుతుంది. గ్రీన్ ఎనర్జీ, విద్యా, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ఇస్తున్న ప్రోత్సాహకాలు ప్రతి ఒక్కరికీ ఉపయోగపడతాయి. ముఖ్యంగా 17 రకాల క్యాన్సర్ ఔషధాలపైన, డయాబెటిక్ లాంటి దీర్ఘకాల వ్యాధులకు వినియోగించే మందులపైనా పన్ను తగ్గింపు కోట్లాది మందికి ఊరటనిచ్చే అంశం. డేటా సెంటర్లు ఏర్పాటు చేసే సంస్థలకు 2047 వరకు ప్రకటించిన టాక్స్ హాలిడే దేశాన్ని డేటా సెంటర్ల కేంద్రంగా మారుస్తుంది. ఇప్పటికే గూగుల్ లాంటి సంస్థలు విశాఖ కేంద్రంగా డేటా సెంటర్లు పెట్టేందుకు ముందుకు రాగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మరిన్ని సంస్థల ఏర్పాటుకు దారిచూపనుంది. పర్యాటక రంగంలో ఇస్తున్న ప్రోత్సాహకాలు అరకు లాంటి పర్యాటక ప్రాంతాలకు ఊతం ఇవ్వనున్నాయి. బడ్జెట్ లో ప్రకటించిన ఏడు హైస్పీడ్ కారిడార్లలో రెండు రాష్ట్రం మీదుగా వెళ్లనున్నాయి. ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ రాష్ట్ర తీర ప్రాంత పారిశ్రామిక ప్రగతికి మరింత ఊతం ఇస్తుంది. కేంద్రం ఎంపిక చేసిన రేర్ ఎర్త్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉండడం విలువైన ఖనిజాల వెలికితీత, తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తుంది. తీర ప్రాంత మత్స్యకార సర్క్యూట్ బలోపేతం చేయడం, మహిళలు చేపలు పెంచుకునే అవకాశం, ఎలాంటి సుంకం లేని చేపల పెంపకం వంటి నిర్ణయాలు మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతాయి. ముఖ్యంగా ఉపాధి 100 రోజుల ప్రణాళికకు ఈ బడ్జెట్ ఊతం ఇస్తుంది. చేనేత రంగానికి ఇస్తున్న ప్రోత్సాహకాలు రాష్ట్ర చేనేత పరిశ్రమను మరోస్థాయికి తీసుకువెళ్లేందుకు ఉపయోగపడుతుంది. కొబ్బరి, జీడిపప్పు, కోకో రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకాలు కోనసీమ ప్రాంతంలోని కొబ్బరి రైతులకు, ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని జీడి రైతులకు ఊరటనిస్తుంది. ఈ బడ్జెట్ భారత భవిష్యత్ శక్తి ఆవిష్కృత బడ్జెట్. బడ్జెట్ ఫలాలు రాష్ట్ర ప్రగతికి దోహదం చేసేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తాం. దేశ ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని పవన్ పేర్కొన్నారు.

## స్కిల్ కేసులో వైసీపీ కుట్రల నిగ్గు తేల్చిన ఈడీ

**- సీఎం చంద్రబాబుకు క్లీన్ చిట్‌తో జగన్ సిగ్గుపడాలి**

**- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

అమరావతి(చైతన్యరథం): క్లీన్‌చిట్ అంటే ఏమిటో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని చూసి వైసీపీ నేతలు నేర్చుకోవాలని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హితవు పలికారు. తిరుమల లడ్డూల కల్తీ నెయ్యి వ్యవహారంలో తమకు క్లీన్‌చిట్ రాలేదని తెలిసినా వైసీపీ ఫేక్ బ్యాచ్ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిందని విమర్శించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ ప్రభుత్వం గతంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వ్యవహారంలో చంద్రబాబు నాయుడు పై బనాయించింది కేవలం ఫేక్ కేసు మాత్రమేనన్నారు. ఇప్పుడు ఈడీ ఇచ్చిన క్లీన్ చిట్‌తో ఆ విషయం స్పష్టమైందని పేర్కొన్నారు. వైసీపీ పన్నిన కుట్రలకు పాత రేస్తూ తమ నాయకుడికి ఈడీ క్లీన్ చిట్ ఇవ్వడం శుభపరిణామమని మంత్రి గొట్టిపాటి హర్షం వ్యక్తం చేశారు. ఈడీ ఇప్పుడు తేల్చేసిన వాస్తవాలను ప్రజలు ఎప్పుడో గ్రహించారని, అందుకే గత ఎన్నికల్లో తమకు అఖండ విజయాన్ని అందించారని ఆయన గుర్తు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి నిజంగా చేతనైతే, తనపై ఉన్న అక్రమాస్తుల కేసుల్లో విచారణకు హాజరై, ధైర్యంగా క్లీన్ చిట్ తెచ్చుకోవాలని మంత్రి గొట్టిపాటి సవాల్ విసిరారు.



## దేశ అభివృద్ధికి దిశానిర్దేశం

**- మంత్రి వాసంశెట్టి సుభాష్**

అమరావతి(చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్--2026 దేశ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే విధంగా ఉందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని సమతుల్యంగా దృష్టిలో పెట్టుకుని కేంద్ర బడ్జెట్ రూపొందించబడిందని తెలిపారు. ఉద్యోగ సృష్టి, నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) కార్యక్రమాలకు కేటాయింపులు పెరగడం యువతకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం తీసుకొచ్చిన ప్రతిపాదనలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక రంగా నికి ఊతమిచ్చే విధంగా బడ్జెట్ ఉండటం వల్ల రాష్ట్రాలకు మరింత పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మహిళా కార్మికులు, స్వయం సహాయక సంఘాలు, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు ఇచ్చిన ప్రాధాన్యం ఆర్థిక ప్రగతికి దోహద పడుతుందని చెప్పారు. 'వికసిత భారత్' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.



# వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలన విధ్వంసమే

- కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు
- మంత్రి నిమ్మల రామానాయుడు
- దొడ్డిపట్ల గ్రామంలో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన



పాలకొల్లు (చైతన్యరథం): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ పాలన కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రజా వేదిక విధ్వంసంతో ప్రారంభమై ఐదేళ్లు సాగిందని... నేడు కూటమి ప్రభుత్వ 20నెలల పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా పయనిస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరిజిల్లా పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామంలో రూ.60 లక్షలతో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రూ.7 లక్షలతో తాడి మెరకలో డ్రైన్ నిర్మాణ పనులకు, మరో రూ.5 లక్షలతో విజయసారథి కాలనీలో కల్వర్ట్ నిర్మాణపనులకు, రూ.15 లక్షలతో గుబ్బల తాతయ్య నగర్ సీసీ రోడ్, డ్రైన్ నిర్మాణ పనులకు, రూ.30 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జగన్‌కు 151సీట్లతో అధికారమిస్తే రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, అందువల్ల గత ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లతో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు సంచలమైన తీర్పునిచ్చారన్నారు. అధికారం కోల్పోయినా హింసను మాత్రం వదల్లేదనేందుకు అంబటి రాంబాబు బూతులపురాణమే నిదర్శనం అన్నారు. ఇటువంటి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పని చేసే కూటమి ప్రభుత్వాన్ని మరో పదిహేను, ఇరవై ఏళ్ళు ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. దొడ్డి పట్ల గ్రామ అభివృద్ధి గత టీడీపీ ప్రభుత్వంలోనూ, నేడు మళ్లీ కూటమి ప్రభుత్వంలోనూ మాత్రమే జరిగిందని, గత వైసీపీ ప్రభుత్వంలో సున్నా అన్నారు. పాలకొల్లు-దొడ్డిపట్ల రోడ్డును గతంలో రూ.20 కోట్లతో నిర్మించామని, మళ్లీ నేడు రూ.5 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రూ.18 కోట్లతో గోదావరి ఏటిగట్టు పటిష్టం చేసే పనులు పూర్తికావస్తున్నాయన్నారు. దొడ్డిపట్ల గ్రామ సమగ్ర అభివృద్ధికి, అవసరమైన నిధులు భవిష్యత్తులోనూ తీసుకువస్తానని మంత్రి రామానాయుడు తెలిపారు.

# మీ పాపాలు పండి దాడులు జరిగాయి

- వైసీపీ ఐదేళ్ల పాలన దుర్మార్గం
- నోరు జారితే జాగ్రత్త జోగి
- గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి



మంగళగిరి(చైతన్యరథం): వైసీపీ ఐదేళ్ల పాలన దుర్మార్గమైనదని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి ధ్వజమెత్తారు. ఆనాడు వాళ్ల కార్యకర్తలు, నాయకులతో మద్యం తయారుచేసి అమ్ముటంవల్ల 30వేల మంది ఆడబిడ్డల పుస్తెలుతెగాయి. కల్తీ మద్యం కేసులో ఉన్న జోగి రమేష్ నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.3,500కోట్ల రూపాయల స్కామ్‌చేశారు. అలాంటి మద్యం కేసులో జోగి రమేష్ జైలుకెళ్లి.. నేడు ఆయన బయటికొచ్చి నోరుంది కదా అని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అంబటి రాంబాబు,జోగి రమేష్ ఇళ్లపై లోకేష్ దాడి చేయించామంటూ నోటి కొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అలాంటి పనులు వైసీపీ నాయకులకే తప్ప టీడీపీ నాయకులకు తెలియదు. వైసీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు ఇంటిపై దాడి చేయలేదా? కార్లలో మనుషులతో చంద్రబాబు ఇంటిపైకి దాడికి వెళితే ఆ కుటుంబం లేదా? కూత వేటు దూరంలో డీజీపీ కార్యాలయం ఉన్నప్పటికి ధైర్యంతో టీడీపీ జాతీయ కార్యాలయంపై దాడి చేసింది మీరు కాదా? ఎవరు రాక్షసానందం పొందారో అందరికీ తెలుసు. గన్నవరానికి చెందిన ఒక బీసీ కులానికి చెందిన వ్యక్తిని నానా ఇబ్బందులు పెట్టారు. నీపాపాలు పండి నీఇంటిపైకి దాడి జరిగింది. అంబటి రాంబాబు మాట్లాడిన మాటలేంటి? మానవ జన్మ ఎత్తినవాడెవడైనా అలా మాట్లాడుతాడా? తల్లిదండ్రులను తిట్టేహక్కు మీకెవరిచ్చారు? పేర్ని నాని కూడా సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. అతనికి మూడింది. వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యంలో ఉండాల్సిన వారు కాదు.. చీడ పురుగులని మండిపడ్డారు. వెంకటేశ్వర స్వామి ఇప్పటికే కొందరికి శిక్ష వేశాడు. జోగి రమేష్ నోరు తెరిచి చంద్రబాబును ప్రమాణానికి రావాలి, లోకేష్ ప్రమాణానికి రావాలి అని పిలుస్తున్నారు.. నీవేమైనా స్వాతంత్ర సమరయోధుడివా? నీ ఇంటికి రావడానికి అని ప్రశ్నించారు. కల్తీ లిక్కర్‌లో మునిగి తేలిన వ్యక్తివి. చంద్రబాబు ఇంటి మీదికి నువ్వు దాడి చేసింది నీవు, మీ నాయకుడు చెప్పిన డైరెక్షన్ కాదా? అని ప్రశ్నించారు. నీవు కల్తీ లిక్కర్ అమ్మలేదా? అమ్మిన మాట వాస్తవం కాదా? సిగ్గు శరం లేకుండా ప్రమాణం చేయడానికి పిలుస్తావా? నీ స్థాయి ఏంటో ఒకసారి ఆలోచించు కోవాలని హితవుపలికారు. జగన్ మెప్పుకోసం నాయకులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డి

## వైసీపీ నాయకుల ప్రచారాలపై మండిపడ్డ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురం, (చైతన్యరథం): కల్తీ కి బ్రాండ్ అంబాసిడర్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, అలాగే వాళ్ళ నాయకులు, అనుచరులు అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్వతిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫేక్ ప్రచారం చేయడంలో వైసీపీ వాళ్లు అరితీరిపోయారని, పీహెచ్డీ చేశారని ఎద్దేవా చేశారు. కల్తీ మద్యాన్ని అమ్మి దాదాపు రాష్ట్రంలో 30 వేల మంది ఆడబిడ్డల పుస్తెలు తెంపారని ఆరోపించారు. కల్తీ మద్యం తాగి కొంతమంది కిడ్నీ, లివర్, మానసిక వ్యాధులతో బాధపడుతూ మృతి చెందారని, ఆ పాపం వైసిపి వాళ్లకే దక్కుతుందని అన్నారు. మనందరి కలియుగ దైవం ఏడుకొండలవారు శ్రీ వెంకటేశ్వర స్వామి అని, అటువంటి దేవస్థానంలో దైవ ప్రసాదమైన లడ్డుని కల్తీ చేసిన ఘనుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. మనకు ఆవు పాలు ద్వారా నెయ్యి వస్తుందని అటువంటి పవిత్రమైన నెయ్యిని కల్తీ చేసిన ఘనుడు జగన్, కల్తీ చేయడంలో ఆయనకు సాటి ఎవరు లేరని అన్నారు. ఆవు పాలను పెరుగుపెట్టి తోడు పెట్టి నెయ్యిని తీసేవారని, పాలు అవసరం లేకుండా నెయ్యిని తయారు చేశారు జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. నాకు తెలిసి ఆవులు, మేకలే పాలు ఇచ్చే వని, గత ప్రభుత్వ హయాంలో జగన్ పాలు అనే నినాదం విన్నానని అన్నారు. కోళ్లు, ఇతర పక్షులు గుడ్లు పెట్టేవని.. ఆ ప్రభుత్వంలో జగన్ గుడ్డు అనే పేరు కొత్తగా విన్నానని అన్నారు. జగన్ పాలనలో రెండు విషయాలు అద్భుతం చేశారని, ఒకటి జగన్ పాలు, రెండు జగన్ గుడ్లు అని అన్నారు. తర్వాత పంది, ఇతర జంతు కొవ్వుతో తయారుచేసిన నెయ్యితో తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రసాదమైన లడ్డు తయారు చేసి లడ్డు పవిత్రతను నాశనం చేశారనే ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ఒక సైకో అని, ప్రజలను నమ్మరు.. ప్రజాస్వామ్యాన్ని నమ్మడు.. సొంత తల్లిని చెల్లిని నమ్మడు.. తన సొంత నీడనే నమ్మడు.. అటువంటి సైకోను మనం ముఖ్యమంత్రిగా గతంలో చేయడం బాధాకరమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుపతి లడ్డుకు ఒక పవిత్రతను తీసుకోవడం జరిగిందని, ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ప్రజల పట్ల కూటమి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు.



# సీఎం చంద్రబాబుకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

## అంబటి అసభ్య దూషణలకు కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి ఖండన

కోడుమూరు, (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కోడుమూరు టౌన్‌లో, కోడుమూరు నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన వైసీపీ పార్టీ మాజీ మంత్రి అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రిపై అసభ్యకరమైన పరుష పదజాలంతో, బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడటం తగదని మండిపడ్డారు. ఇటువంటి వ్యాఖ్యలను ప్రజలు ఏమాత్రం సహించరని స్పష్టం చేశారు. అంబటి రాంబాబు తన వ్యాఖ్యలకు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ, ప్రజల మనోభావాలను గౌరవించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. రాష్ట్రంలో తిరుమల లడ్డు కల్తీ నెయ్యి కేసులో దోషులుగా వైసీపీ పార్టీ నాయకులు అడ్డంగా దొరికి వారు చేసిన పాపాలు బయట పడేందుకు దీని నుండి డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ఇటువంటి పన్నాగాలు పన్నుతున్నారని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలంటే ఇటువంటి నీచ నాయకులను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అంబటి రాంబాబు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# విద్యార్థి దశ నుంచే సేవా గుణాన్ని పెంపొందించుకోవాలి

## కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగదీశ్వరి పిలుపు




కురుపాం, (చైతన్యరథం): పార్వతిపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం, మండల కేంద్రంలోని విద్యార్థి దశ నుంచే సేవా గుణాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గారు యువతకు పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ, లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా మానవతా దృక్పథంతో సేవలందిస్తున్న రెడ్ క్రాస్ సంస్థలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరాలని కోరారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు మరియు ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. కష్టపడే తత్వం, క్రమశిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించడం సాధ్యమేనని చెప్పారు. అనంతరం, రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన దుప్పట్లను కలెక్టర్ చేతుల మీదుగా నిరుపేదలకు అవసరార్థులకు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ డా. ఎం.శ్రీరామ మూర్తి, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



# అంబటి రాంబాబు చిల్లర నాయకుడు

## సత్తెనపల్లి శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ధ్వజం

గుంటూరు, (చైతన్యరథం): జగన్ ఆధికారంలోకీ వచ్చిన నాటి నుంచి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని వైసీపీ నేతల ప్రవర్తన, ఆరాచకాన్ని ఛీ కొట్టి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని సత్తెనపల్లి శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గుంటూరులోని నివాసంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ ప్రతిపక్షపార్టీగా ఉండి పోతులను నరికినట్టు నరుకుతామని బ్లాక్ మెయిల్ చెయ్యాలని చూస్తున్నారని మండిపడ్డారు. మీ బ్లాక్ మెయిల్ కు భయపడం జగన్ రెడ్డీ అని గద్దించారు. అంబటి రాంబాబు పేరు కూడా తాను ఉచ్చరించనన్నారు. అంబటి గురించి తనకు పూర్తిగా తెలుసన్నారు. చంద్రబాబునాయుడు లాంటి నాయకుడు, ఆయన రికార్డు బ్రేక్ చేసే నాయకుడు పుట్టడన్నారు. అధికారం లోకి వచ్చిన కక్ష సాదింపును ప్రోత్సహించని శాంతమూర్తి చంద్రబాబు అన్నారు. ఒక్క అవకాశం అని జగన్ అరాచకాలు చేశారన్నారు.

నరకుతాము, పొడుస్తామని స్లోగన్స్ ఇచ్చే పార్టీలను ఎలక్షన్ కమిషన్ రద్దు చెయ్యాలన్నారు. బస్టాండులో జేబులు కొట్టే వారి భాషను అంబటి రాంబాబు, వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. తిరుపతి పవిత్రతకు మీరు చేసిన ద్రోహం ఏ హింధువు క్షమించదన్నారు. కల్తీ నెయ్యి అంశాన్ని పక్కదారిని పట్టించేందుకు అంబటి బూతులు మాట్లాడాడన్నారు. వంగవీటి ప్రజా నాయకుడు అంబటి చిల్లర నాయకుడు అని పోలిక చెప్పారు. కులం చంద్రబాబును బూతులు తిట్టమని చెప్పిందా అని నిలదీశారు. చంద్రబాబునాయుడు ఇంటిపై జోగి రమేష్ దాడి సందర్భంలో జగన్ కార్యకర్తలకు ఆ మాత్రం ఆగ్రహం ఉండదా అని ప్రశ్నించారు కదా.. చంద్రబాబును బూతులు తిడితే పార్టీ కార్యకర్తలకు మరి కోపం రాదా, నువ్వు నేర్పిన విద్యే జగన్ అని కన్నా ఎద్దేవా చేశారు.

# జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మేకపాటి ప్రమాణస్వీకారం

నెల్లూరు, (చైతన్యరథం): ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన మేకపాటి శాంతి కుమారి నగరంలోని పిచ్చిరెడ్డి కళ్యాణమండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడి, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు బీద రవిచంద్ర, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణా రెడ్డి, ఉదయగిరి



శాసనసభ్యులు కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వర రావు, మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్ర శేఖర్ రెడ్డి ,ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మయ్య నాయుడు తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు,మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జగన్‌మోహన్‌రెడ్డికి హిందూయిజంపై అవగాహన లేదు

## వైసీపీ నేతలపై రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మండిపాటు

రాజమహేంద్రవరం, (చైతన్యరథం): రాష్ట్రంలో వైసిపి నేతల బూతు పురాణాలు ,వైసీపీ అర్చకులకు ఆద్యుడు ఆరాధ్యుడు జగన్ మోహన్ రెడ్డేనని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎద్దేవా చేశారు. తిరుపతి లడ్డూ విషయంలో 250 కోట్ల రూపాయలు నష్టం కలగడమే కాక, భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. క్రైస్తవ్యాన్ని నమ్మిన వ్యక్తి జగన్‌కు హిందూ ఇజంపై అవగాహనలేదన్నారు. తిరుపతి విషయంలో దోపిడీ చేశారనిఅందుకే కేసుల్లో ఇరుక్కున్నారని బుచ్చియ్య చౌదరి పేర్కొన్నారు. సొంత బాబాయిని హత్య చేయించి....చంద్రబాబుపై నెపం మోపాలని చూశారన్నారు. అధికారంలో ఉన్న మేము రపరపా అంటే ఎక్కడ ఉంటారో తెలీదని మొన్నే చెప్పామన్నారు. ఒకటా రెండా ఏకంగా నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన నాయకుణ్ణి బూతులు ఎలా తిడతారని నిలదీశారు. శాంతంగా ఉండాలని చెప్పే నాయకుడు మా నాయకుడు చంద్రబాబు అని కితాబిచ్చారు. ఈ నెపాన్ని మా పై నెట్టడానికి జగన్మోహన్ రెడ్డి అంబటి నీ హత్య చేసినా చేయొచ్చన్నారు. జగన్ నీ భార్యని తీసుకుని ఎపుడైనా తిరుపతి వెళ్ళాలవా....విజయవాడ వెళ్ళావా అని ప్రశ్నించారు. నీ మతం వేరు..... తాము అందరి మతాలను గౌరవిస్తామన్నారు. శిక్ష తప్పదు అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల మీద పోరాటం చేయడం చేత కాదు.



పాదయాత్ర ఏ మొహం పెట్టుకొని చేస్తారని నిలదీశారు. కేంద్ర సహకారం ఉన్నప్పటికీ ఆరోజు నువ్వు సాధించింది ఏమీ లేదని జగన్‌రెడ్డిని దుయ్యబట్టారు. వైసీపీ నేతలు నోటికి వచ్చినట్లు మాట్లాడితే వీపు బద్దలవుతుంది.. ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని వైసీపీ నేతలను అని హెచ్చరించారు. జగన్మోహన్ రెడ్డి బెంగళూరు ప్యాలస్ కే పరిమితం అవుతావు జాగ్రత్త అని పేర్కొన్నారు. ఒక్కసారి చంద్రబాబు కన్నెర్ర చేస్తే ఎలా ఉంటుందో రుచి చూపించడానికి తామే సిద్ధంగా ఉన్నామని అల్టిమేటం ఇచ్చారు. మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వైసీపీ నేతలు సిగ్గూ బిడియం, భయం లజ్జా వదిలేస్తే ఎందుకు ఊరుకోవాలని నిలదీశారు. జగన్‌కు బెయిల్ రద్దు చెయ్యాలన్నారు. 13 ఏళ్లుగా బెయిల్‌పై ఉంటే ఎలా న్యాయం జరుగుతుందన్నారు. విచారణ పూర్తిచేసి, బాబాయ్ హత్య కేసును వెంటనే తేల్చాలని డిమాండ్ చేశారు. కోడి కత్తి కేసులో జగన్ వాంగ్మూలం ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. తెలుగు దేశంలోని కాపులంతా నాయకులేనని అలా కాదని అంబటి ఒక్కడే కాపు నాయకుడవుతాడా అని నిలదీశారు. లడ్డూ కల్తీలో వాళ్ళంతట వాళ్లే క్లీన్ చీట్ ఇచ్చుకుంటున్నారన్నారు. 240 కోట్లు దోపిడి చేశారన్నారు. పాలే లేవు, నెయ్యి ఎలా వచ్చిందని నిలదీశారు. నోరు అదుపులో లేకపోతే ప్రజలు గుణపాఠం చెప్తారన్నారు. రౌడీ రాజ్యాన్ని కొనసాగనివ్వడం జరగదన్నారు. ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో కులాలకూ మతాలకూ అతీతమన్నారు.

పార్లమెంటులో మోదీ అన్నీ దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్తున్నారన్నారు. బడ్జెట్‌లో అన్ని కేటాయింపులు ఉంటాయన్నారు. జౌళి శాఖకు పెద్దపీట వెయ్యాలని కోరారు. నిధులు సమీకరణలో కేంద్రానికి రాష్ట్రాల సహకారం కూడా కావాలన్నారు.

ఈ సమావేశంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రూరల్ మండలం తెదేపా అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, కడియం మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, తలారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.



# పీడీ యాక్టుతో అంబటి పీచమణచండి

## ఎమ్మెల్యే మొహమ్మద్ నజీర్ అహ్మద్ మన్నవ మోహనకృష్ణ ఫిర్యాదు

గుంటూరు, (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై వెంటనే పీడీ యాక్ట్ ప్రయోగించాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నజీర్ అహ్మద్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ అంబటి రాంబాబుపై పీడీ యాక్ట్ తోపాటు ఐటీ సెక్షన్లు 67 ఱ 66జు కింద కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. వెనక ఉండి ఇదంతా నడిపిస్తున్న జగన్ రెడ్డి నీచ కుట్రలకు తెలుగుదేశం పార్టీ కేడర్ కొంచెం కూడా బెదరదని మన్నవ మోహనకృష్ణ స్పష్టం చేశారు.



# జగన్ డైరెక్షన్‌లోనే వైసీపీ మూకల కారుకూతలు

## అంబటి దిష్టి బొమ్మ దగ్ధం, కోవూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

కొవ్వూరు, (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును వైసీపీ నేత అంబటి రాంబాబు అసభ్య పదజాలంతో దూషించిన ఘటనపై ఆదివారం రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఆశిష్ లాల్ తీవ్రంగా స్పందించారు. ఆదివారం పలువురు టీడీపీ నాయకులతో కలిసి ఆంబోతులాంటి అంబటి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవన్నారు. ముఖ్యమంత్రిని ఈ విధంగా అసభ్య పదజాలంతో దూషించడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తిరుపతిలో జరిగిన కల్తీ లడ్డు ఘటనపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే జగన్ మోహన్ రెడ్డి అండతో అంబటి రాంబాబు నీచరాజకీయాలకు పాల్పడ్డాడని విమర్శించారు. ” “జగన్ కు ఇంకా బుద్ధి రాలేదన్నారు. జగన్ కు జరిగిన రాజకీయ అవమానం ఇంకా సరిపోలేదని ప్రజలు ఇచ్చిన గుణపాఠాన్ని ఇంకా నేర్చుకోకుండా, తొత్తులను పంపించి చంద్రబాబు నాయుడుపై ఏదిపడితే అది మాట్లాడిస్తూ శునకానందం పొందుతున్నాడని ఎద్దేవా చేశారు. “ఇవన్నీ జగన్ డైరెక్షన్‌లోనే జరుగుతున్నాయని ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఇకనైనా వైఖరిని మార్చుకోవాలన్నారు. ప్రజల ముందుకు వెళ్లేటప్పుడు ఎలా మాట్లాడాలో మీ నాయకులకు కనీసం నేర్పి పంపాలి ” అని సూచించారు. చివరగా ఆయన మాట్లాడుతూ, జనాలు ఇప్పటికే జగన్‌కు 2024 ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని ఈసారి ఇలా మాట్లాడి చెప్పుల దండ వేసి చీపుర్లతో కొట్టే విధంగా చేసుకోవద్దని జగన్, అదే విధంగా జగన్ మూకలను హెచ్చరించారు, అనంతరం అంబటి రాంబాబు అభ్యంతరకరమైన వ్యాఖ్యలపై కొవ్వూరు పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

# విజయవాడలో పెల్లుబికిన నిరసన సెగలు



విజయవాడ, (చైతన్యరథం): నగరంలో టీడీపీ శ్రేణులు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్యమంత్రిని అవహేళన చేసే విధంగా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో మహిళా కమిటి ఆధ్వర్యంలో పైపుల రోడ్డు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాంబాబు దిష్టిబొమ్మను గాడిద మీద ఉంచి ఊరేగించారు. నియోజకవర్గ తెలుగు యువత, ఎస్సీ సెల్, మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. . తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిశీలకులు దేవతోటి నాగారాజు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అందరికీ ప్రాధాన్యతనిచ్చిన ప్రజాహిత బడ్జెట్



విజయవాడ, (చైతన్యరథం): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2026 దేశ పేదలు, మహిళలు, యువత అభివృద్ధిని కేంద్రబిందువుగా ఎంచుకున్న సమగ్ర బడ్జెట్ అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రత్యేక ప్రోత్సాహాలు కల్పించడం ముఖ్య విశేషమని తెలిపారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు వ్యాపార రంగంలో ఎదగాలన్న ఆలోచనకు ఈ బడ్జెట్ బలాన్నిస్తోందన్నారు. ఈ దృక్పథం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటినుంచో చెబుతున్న లక్ష్యాలకు అనుగుణంగా ఉందని చెప్పారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం లభించేలా పలు చర్యలు ప్రకటించారని, ముఖ్యంగా బయో ఔషధాలు, అర్ధవాహక చిప్ తయారీ, కంటైనర్ తయారీ, వస్త్ర యంత్రాల తయారీ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా దేశీయ పరిశ్రమలు బలపడతాయని అన్నారు. అరుదైన భూఖనిజాల వినియోగంపై దక్షిణాది రాష్ట్రాలకు, అందులో ఆంధ్రప్రదేశ్‌కు అవకాశాలు కల్పించడాన్ని స్వాగతించారు. చెన్నై, హైదరాబాద్, హైదరాబాద్, బెంగళూరు వేగ రైలు మార్గాల ప్రణాళిక వల్ల ఆంధ్రప్రదేశ్‌కు కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. మెగా వస్త్ర పార్కులు, ఖాదీ, చేనేత అభివృద్ధి, క్రీడా సామగ్రి తయారీ యూనిట్ల ఏర్పాటు వంటి నిర్ణయాలు ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తాయని చెప్పారు. ప్రముఖ దేవాలయాలు ఉన్న నగరాల అభివృద్ధికి నిధులు కేటాయించడాన్ని ప్రస్తావిస్తూ, ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయంతో ప్రసిద్ధిగాంచిన విజయవాడకు ఇది ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధితో దేశవ్యాప్తంగా వేలాది మందికి మార్గదర్శకులుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.క్రీడా రంగంలో ఆటగాళ్లతో పాటు శిక్షకులు, వైద్య నిపుణులు, సహాయక సిబ్బంది తయారీకి దోహదపడే విధంగా చర్యలు తీసుకోవడం హర్షణీయమని చెప్పారు. దేశంలోనే క్రీడా సామగ్రి తయారీ పెంపుకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ 2047 లక్ష్యాలను ప్రతిబింబించే విధంగా ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రసంగం సాగిందని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకున్న వికసిత్ భారత్ 2047 దిశగా ఈ బడ్జెట్ బలమైన అడుగని, భారత్‌ను ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ఇది ఉపయుక్తమవుతుందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.



# ఓబులమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే పరిటాల సునీత

## యాదవుల ఆహ్వానం మేరకు పౌర్ణమి పూజలు

రాప్తాడు, (చైతన్యరథం): యాదవుల ఆరాధ్య దైవం శ్రీ వీర ఓబులమ్మ అమ్మవారి ఆశీస్సులతో రాప్తాడు నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని.. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకాంక్షించారు. రాప్తాడు మండలం బుక్కచెర్ల గ్రామ సమీపంలో కొలువైవున్న వీర ఓబులమ్మ అమ్మవారికి ప్రతి ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన పౌర్ణమి వేడుకలకు ఎమ్మెల్యే పరిటాల సునీతను యాదవులు, గ్రామస్థులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆదివారం సాయంత్రం ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ గుడికాపులు ఎమ్మెల్యే సునీతకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇక్కడ ప్రతివారం పూజలతో పాటు ప్రతి పౌర్ణమి రోజు రాత్రి మొత్తం జాగరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ దేవస్థానం పరిధిలో జిల్లావ్యాప్తంగా 600 కుటుంబాల వారు కాపులుగా ఉండటం విశేషం. గతంలో సౌకర్యాలకు దూరంగా ఉన్న ఆలయాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్టు నిర్వాహకులు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఎలాంటి రహదారి సౌకర్యం లేని సమయంలో దేవస్థానానికి 10లక్షల నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. బుక్కచెర్ల గ్రామం నుంచి సుమారు మూడు కిలోమీటర్లు మట్టి రోడ్డును వేసినట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని తెలిపారు. ఆ అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే సునీత ఆకాంక్షించారు.

# వైసీపీ నేత ప్రసన్న దిష్టిబొమ్మ దగ్ధం



బుచ్చిరెడ్డిపాలెం, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురించి మాట్లాడే స్థాయి ప్రసన్న కుమార్‌కు లేదని తెలుగుదేశం పార్టీ నేతలు అన్నారు. కోవూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి సీఎం చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుచ్చిరెడ్డిపాలెం మండల కేంద్రంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టి ప్రసన్న కుమార్ దిష్టి బొమ్మను చెప్పులతో కొట్టారు. ఈ సందర్భంగా రూరల్ పార్టీ అధ్యక్షులు బెజవాడ జగదీష్ మాట్లాడుతూ ప్రసన్నకుమార్ రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిందే చంద్రబాబు నాయుడు అని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రసన్నకుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా ఒక్క తట్ట మట్టి కూడా వేసిన పాపాన పోలేదన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతి గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యేకు లేదని ఘాటుగా స్పందించారు. మెల్యే ప్రశాంతి ఆధ్వర్యంలో ప్రతి మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. మరోసారి సీఎం చంద్రబాబుపై, ఎమ్మెల్యే ప్రశాంతిపై వ్యాఖ్యలు చేస్తే మరింత ఘాటుగా స్పందిస్తామని చెప్పారు. మాజీ మండలాధ్యక్షులు బత్తల హరి కృష్ణ మాట్లాడుతూ తెలుగు జాతి ముద్దుబిడ్డ నారా చంద్రబాబునాయుడుపై ప్రసన్న కుమార్ రెడ్డి వ్యాఖ్యలు తెలుగు ప్రజలు తలదించుకునేలా ఉన్నాయని అన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ఎప్పుడూ ప్రాధాన్యత తీస్తారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలోనే మలిదేవి డ్రైన్ కు శంకుస్థాపన జరిగిందన్నారు. బుచ్చి మండలంలోని అనేక ప్రాంతాల్లో సిసి రోడ్లు వేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. పూటకొక మాట మార్చే నీలాంటి వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. బుచ్చి క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు మాట్లాడుతూ ప్రశాంతమ్మ చేతిలో 50 వేలు ఓట్లతో ఓడిపోయిన ప్రసన్న కుమార్ రెడ్డి గత చరిత్ర తెలుసుకోవాలన్నారు. నోటి దురదతోనే తన రాజకీయాన్ని నాశనం చేసుకున్నారని, ఇదే కొనసాగితే భవిష్యత్తులో ప్రశాంతి చేతిలోనే లక్ష ఓట్లతో ఓటమిపాలవడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో, టౌన్ అధ్యక్షుడు గుత్తాసేనయ్య, టౌన్ మాజీ అధ్యక్షులు ఎంవి శేషయ్య మండల క్లస్టర్ ఇంచార్జ్ వింజం రామానాయుడు, పటేల్ సుధాకర్ రెడ్డి అలాగే సీనియర్ నాయకులు పుట్టా సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబును తిడితే

# వైసీపీ మూకల పాపాలు మాసి పోవు

గుంటూరు, చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అసభ్యకర, అవమానకర వ్యాఖ్యలను ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ తీవ్రంగా ఖండించారు. గుంటూరు అరండల్‌పేటలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మోహనకృష్ణ మాట్లాడుతూ అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు రాజకీయ విమర్శలు కావని, అవి నీచమైన వ్యక్తిగత దూషణలు మాత్రమేనని తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అసభ్య పదజాలంతో మాట్లాడటం అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవంపై నేరుగా చేసిన దాడేనని స్పష్టం చేశారు. అంబటి రాంబాబు గత 32 సంవత్సరాల్లో ఒక్కసారి మాత్రమే గెలిచాడు, అంటే నిన్ను ప్రజలు ఎంత అసహ్యించుకుంటున్నారో తెలుస్తోందని అన్నారు. అంబటి వంటి వాళ్లు రాజకీయాలకు అనహర్హులని, ఇలాంటి సైకోలని నడిపోస్తున్న పెద్ద సైకో బెంగళూరు ప్యాలెస్‌లో ఉంటూ వైసీపీ మూకలతో ఇలాంటి పనులు చేపిస్తున్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని దూషించడం వల్ల వైసీపీ చేసిన అవినీతి, విధ్వంస పాపాలు ఎప్పటికీ కడగబడవని మన్నవ మోహనకృష్ణ స్పష్టం చేశారు.



# కొల్హాపురి అమ్మవారి సన్నిధిలో మంత్రి సవిత

## జాతరలో ప్రత్యేక పూజలు

పెనుకొండ, (చైతన్యరథం): సోమందేపల్లి మండలం మాగేచెరువులో ఆదివారం కొల్హాపురి అమ్మవారి జాతర జరిగింది. ఈ జాతరకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి సవిత హాజరయ్యారు, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటేష్, తెదేపా నాయకులు రామచంద్ర మంత్రి సవితకు పూల మాల వేసి, శాలువా కప్పి స్వాగతం పలుకగా, అమ్మవారి జ్యోతులు మోస్తున్న మహిళలను మంత్రి మాట్లాడి వారితో కలిసి జ్యోతిని మోశారు, అనంతరం అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజల్లో మంత్రి సవిత



## మహిళలతో కలిసి జ్యోతులు మోసి...

పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో కన్వీనర్ వెంకటేష్, రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, హిందూపురం పార్లమెంటు కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, గోరంట్ల మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శైలజ, సంజీవరెడ్డి, మగేచెరువు సర్పంచ్ నరసింహులు, శరత్చంద్ర, చాకర్లపల్లి శ్రీరాములు, వడ్డే శివప్ప, సోమందేపల్లి పట్టణ అధ్యక్షుడు వడ్డే సూరి,శివశంకర్ యాదవ్,పూజారి శంకర, సుభాన్, అనసూయ, వరలక్ష్మి, రామాంజినేయులు,రంగేపల్లి నాగరాజు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుపై అవాకులూ చవాకులూ..

# అంబటి వికృత చేష్టలకు పరాకాష్ట

### ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ



ఒంగోలు, (చైతన్యరథం): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అంబటి రాంబాబు ముఖ్యమంత్రిపై చేసిన అశ్లీల, అవాకులు, చవాకులు రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే అత్యంత దిగజారుడు స్థాయికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఖండించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇది రాజకీయ విమర్శ కాదన్నారు. ఇది పూర్తిగా అసందర్భ ప్రేలాపన అని అంతకు మించిన రాజకీయ వికృత చేష్ట అని ధ్వజమెత్తారు. ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు కొనసాగితే, ప్రజలే తిరగబడి అంబటి రాంబాబుకు తగిన బుద్ధి చెప్పే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కనీసం చదువుకున్నవారికి ఉండాల్సిన జ్ఞానం, సంయమనం లేకుండా, ఒక బజారు వ్యక్తిలా, వీధి రౌడీ మాదిరిగా మాట్లాడటం అంబటి రాంబాబు వికృత కృత చేష్టలకు స్పష్టమైన నిదర్శనం. ప్రజాస్వామ్య వ్యవస్థపై, రాజ్యాంగ పదవుల గౌరవంపై ఎలాంటి గౌరవం లేకుండా మాట్లాడటం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దుర్మార్గ వైఖరిని బహిర్గతం చేస్తోందన్నారు. రాష్ట్రంలో కావాలనే అలజడులు సృష్టించి, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలనే పక్కా కుట్రలో భాగంగానే ఈ వ్యాఖ్యలు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మీద తామే దాడులు చేసుకుని, ఆ నేరాన్ని ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేయడం అత్యంత నీచమైన రాజకీయ నాటకంగా రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇది ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఆడుతున్న చౌకబారు డ్రామా తప్ప మరొకటి కాదన్నారు. ముఖ్యంగా టీటీడీ కల్తీ నెయ్యి కేసులో వెలుగులోకి వస్తున్న నిజాలు, అవినీతి వాసనలు బయటపడకుండా ఉండేందుకే ఈ బూతు పురాణాలు తెరపైకి తెస్తున్నారన్నారు. ఈ కేసులో తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, దర్యాప్తును పక్కదారి పట్టించడానికి వేసిన ఎత్తుగడలో భాగమే అంబటి రాంబాబు అసభ్య వాగుడు అన్నారు. ముఖ్యమంత్రి పై వ్యక్తిగత దూషణలు చేసి రాజకీయంగా బతికిపోవచ్చని అనుకోవడం వారి భ్రమ మాత్రమేనన్నారు.

రాష్ట్ర ప్రజలు ఈ నీచ, దుర్మార్గ రాజకీయాలను పూర్తిగా తిరస్కరించే రోజు మళ్లీ దగ్గకొచ్చేసిందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వెంటనే ఈ వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజాస్వామ్య శక్తులు, రాష్ట్ర ప్రజలు తగిన రీతిలో సమాధానం చెబుతారని స్పష్టంగా హెచ్చరించారు.



## సీఎం చంద్రబాబుకు క్షమాపణ చెప్పకపోతే

# అంబటిపై వికలాంగుల చెప్పులవర్షం ఖాయం

### వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి హెచ్చరిక

అనంతపురం, (చైతన్యరథం): ఎన్టీఆర్ సర్కిల్ నుండి దివ్యాంగుడి సైకిల్‌కి అంబోతు రాంబాబు దిష్టిబొమ్మను కట్టి ఈడ్చుకెళ్లి టవర్ క్లాక్ వద్ద దివ్యాంగులు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి దగ్ధం చేశారు. ఖబద్దార్ అంబోతు రాంబాబు నువ్వు రాష్ట్రంలో ఎక్కడున్నా దివ్యాంగులు నీకు చెప్పుల వర్షం కురిపిస్తారు అని హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా మార్చిన మహానుభావుడు మా చంద్రబాబును అనడానికి నీకు నోరెలా వచ్చిందని దుయ్యబట్టారు. ఇలాంటి అంబోతులను ఎంత మందిని వదిలినా వాటిని తరిమి కొట్టడానికి మేము సిద్ధంగా ఉన్నామని జగన్‌రెడ్డి సహా వైసీపీ నేతలందరికీ తెగేసి చెప్పారు. కూటమి నాయకులపై ఇలాంటి అనుచిత మాటలు మాట్లాడితే.. మీకూ ఇదే గతి పడుతుంది! ఏదైనా ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ ఇలాంటి మాటలు సరి కావు అని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ సంఘాల నాయకులు బ్రహ్మ, గంగా నాయుడు, మాబు, ఎర్రిస్వామి, మోహన్ కృష్ణ, రాంబాబు, శ్రీనివాసులు, తెలుగు యువత నాయకులు చంద్రబాబు నాయుడు, కృష్ణ గోపాల్, జగదీష్, ప్రధాన కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

# అంబటిని అదుపులో పెట్టండి

### తిరుపతి ఎస్పీకి ఫిర్యాదు చేసిన తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి

తిరుపతి, (చైతన్యరథం): అంబటి రాంబాబు అసభ్య వ్యాఖ్యలపై తిరుపతి జిల్లా ఎస్పీకి తుడా ఛైర్మన్, తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. నీచరాజకీయాలఅంబటి రాంబాబు గౌరవప్రదమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్ల చేసిన అత్యంత అసభ్యకరమైన, అహంకారపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి స్థానిక తెలుగుదేశం నాయకులతో కలిసి నేడు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడును కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా డాలర్స్ దివాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమని, కానీ అంబటి రాంబాబు స్థాయి మరచి నీచమైన భాషను వాడటం ఆయన సంస్కారహీనతకు నిదర్శనమని మండిపడ్డారు. గౌరవ ముఖ్యమంతిని ఉద్దేశించి అంబటి చేసిన వాఖ్యలు కేవలం వ్యక్తులకు మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థలకే అవమానకరమని దివాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం పోయినా అంబటి రాంబాబులో అహంకారం తగ్గలేదని, నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇలాంటి అసభ్య ప్రసంగాలు సమాజంపై చెడు ప్రభావాన్ని చూపిస్తాయన్నారు. అందుకే ఆయనపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. అంబటి రాంబాబు చేస్తున్న వ్యాఖ్యలు సమాజంలో అశాంతిని రేకెత్తించేలా ఉన్నాయన్నారు. తక్షణమే ఆయనపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీనరీ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, కోడూరు బాల సుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, యశ్వంత్ రెడ్డి,సురేంద్ర నాయుడు, పుష్పవతి, తదితరులు పాల్గొన్నారు.



## కందుకూరు పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో

# అంబటి దిష్టిబొమ్మ దగ్ధం

కందుకూరు, (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసిపి నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కందుకూరులో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఫైర్ అయ్యారు. అంబటి రాంబాబు దిష్టిబొమ్మను పోస్ట్ ఆఫీస్ సెంటర్లో దగ్ధం చేశారు. అంబటి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. జగన్మోహన్ రెడ్డి కనుసన్నల్లోనే అంబటి ఈ రకమైన వ్యాఖ్యలు చేశారని నాయకులు మండిపడ్డారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మల్లేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోనే సీనియర్ రాజకీయ నాయకుడు, ఎక్కువసార్లు ముఖ్యమంత్రిగా పరిపాలించిన నారా చంద్రబాబు నాయుడును అంబటి రాంబాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. అంబటి ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని, తగినరీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వెంటనే రాంబాబుని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరూ గౌరవించే వ్యక్తి నారా చంద్రబాబునాయుడు గారని, వైసీపీ నేతలు చేసిన తప్పును సమర్థిస్తూ అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటు అన్నారు. వైసీపీ నేతలు తల తిక్కతో ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని, అలాంటి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, సలాం, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ రఫీ, ముచ్చు శ్రీను, మహర్షి శ్రీను, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, కంసాని మయూరి, ఘట్టమనేని అఖిల, అశ్విని చుండూరు శ్రీనివాసులు, ముచ్చు వేణు, ముప్పవరపు వేణు, భవనాశి వెంకటేశ్వర్లు, పులి నాగరాజు, గుమ్మా శివ, నల్లూరి సూర్యనారాయణ, అత్తంటి శివకృష్ణ, మచ్చ మనోహర్, చల్లా మహేంద్ర, సుదర్శి శ్యామ్, చనమాల శ్రీధర్, కోటా కిషోర్, వార్డు అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# నోరు అదుపులో లేకపోతే
# జగన్‌రెడ్డి ఇంటినే ముట్టడిస్తాం

**చంద్రబాబుగారిపై అవాకులు, చెవాకులు పేలితే మీకు రోడ్డు మీద చెప్పులతో సన్మానం చేస్తాం**

**జగన్, అంబటి రాంబాబు, వైసీపీ నేతలకు ఎమ్మెస్ మాస్ వార్నింగ్**

అనంతపురం, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి మాట్లాడే సమయంలో నోరు అదుపులో పెట్టుకోవాలని, అదుపుతప్పి అవాకులు, చెవాకులు పేలితే జగన్మోహన్ రెడ్డి ఇంటిని ముట్టడించడానికైనా వెనకడుగు వేసే పరిస్థితి ఉండబోదని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యుడు శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు మాస్ వార్నింగ్ ఇచ్చారు. చంద్రబాబు గురించి తప్పుడు కూతలు కూసిన అంబటి రాంబాబుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఏవిధంగా బుద్ధి చెప్పారో, తీరు మార్చుకోకపోతే జగన్మోహన్ రెడ్డికి కూడా ఇదే గతి పడుతుందని ఎమ్మెల్యే రాజు హెచ్చరించారు. అనంతపురంలోని తమ నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజు మాట్లాడుతూ నీచాతి నీచుడు అంబటికి జగన్ రెడ్డి అండగా నిలవడం విడ్డూరంగా ఉందన్నారు. అంబటి రాంబాబు నీచంగా మాట్లాడితే జగన్, వైసీపీ నేతలు, కార్యకర్తలు అతన్ని సమర్థించడం దారుణమన్నారు. జగన్‌పై ఎవరైన వ్యాఖ్యలు చేస్తే టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసే అభిమానులు ఉంటే.....4సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, 45ఏళ్లు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు అభిమానులు ఉండరా? ప్రజల మధ్య, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ఉద్దేశంతోనే అంబటి రాంబాబు మాట్లాడాడన్నారు. ఇలా మాట్లాడిన తర్వాత ఏ పార్టీ అయినా ఉపేక్షించకూడదన్నారు. జగన్ కి క్రమశిక్షణ చర్యలు అంటే ఏంటో అర్థం కూడా తెలియదన్నారు. అంబటిపై చర్యలు తీసుకోడన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ దళితుడిని చంపి డోర్ డెలివరీ చేస్తే జగన్ పట్టించుకోలేదని గుర్తు చేశారు. అంబటి గతంలో మహిళలతో అసభ్యంగా వ్యవహరిస్తే అప్పుడు కూడా చర్యలు లేవన్నారు. అవంతి శ్రీనివాస్ మహిళను ఇబ్బందిపెడితే, అసభ్యంగా ప్రవర్తిస్తే జగన్ చర్యలు తీసుకోలేదన్నారు. పార్లమెంటు మెంబరుగా ఉండి నీచంగా వ్యవహరించిన గోరంట్ల మాధవ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అంబటి చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా, మహిళలను కించపరిచేలా ఉంటే జగన్‌కి వినబడలేదా? జగన్, సాక్షి ఛానల్, మీడియా, వైసీపీ నేతలు కావాలనే అంబటిని వెనకేసుకు రావడం దొందూ దొందే అనిపిస్తోందన్నారు. తప్పు చేసింది అంబటి అయితే...కాపు కులానికి ఏం సంబంధం అమర్నాథ్ అని నిలదీశారు. అంబటి రాంబాబు అహంకారం, ఒళ్లు బలిసి, కళ్లు నెత్తికెక్కి మాట్లాడితే, గుడివాడ అమర్నాథ్ లాంటి వ్యక్తి కాపునేత అంబటి రాంబాబు పై కుట్ర చేస్తున్నాం అంటున్నారని, పిచ్చి మాటలు మాట్లాడింది రాంబాబు కాగా ఇక్కడ కులంతో ఏం సంబంధం ఉంది? మీరు కులాల మధ్య చిచ్చు పెట్టాలని ప్రయత్నాలు చేయడం దుర్మార్గం అని ఎమ్మెల్యే ఎమ్మెస్ దుయ్యబట్టారు. అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై అంబటిని నిలదీయడానికి తన ఇంటికి వెళితే....పచ్చమూకలు, రౌడీలు అని జగన్, సాక్షి హడావుడి చేశారు. మీకు ఉన్న అభిమానులు మా నాయకుడికి ఉండరా? జగన్ ను ఏమీ అనకపోయినా మీ నాయకులను రెచ్చగొట్టి టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేయించలేదా? అని ప్రశ్నించారు. జోగి రమేష్ చంద్రబాబుపై దాడి చేస్తే మంత్రి పదవి ఇచ్చి జగన్ గౌరవించిన వైసీపీ నైజం వల్లే ఈ అనార్థాలు దాపురించాయన్నారు. చంద్రబాబు ఇంటి మీదకు జోగి రమేష్ 50కార్లలో రౌడీలను తీసుకెళ్లి, తమ కార్లలో రాడ్లు, కర్రలు, కత్తులు తీసుకెళ్లలేదా అని ప్రశ్నించారు. ఆ రోజు పోలీసు అధికారులను అడిగితే.....జోగి రమేష్ చంద్రబాబుకు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లారని దుర్మార్గంగా చెప్పారు. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి జోగి రమేష్‌ని అదుపు చేసి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదన్నారు. తప్పు చేసిన వారిని జగన్ సమర్థించడం వల్లే సమాజంలో ఈ అలజడులకు కారణమవుతున్నాయన్నారు. నిన్న కూడా అంబటి ఇంటికి మా టీడీపీ కార్యకర్తలు వినతిపత్రం ఇవ్వడానికే వెళితే ఆయన బయటకు రాలేదన్నారు. అంబటి గత అసెంబ్లీలో చంద్రబాబుపై నీచంగా మాట్లాడాడన్నారు. కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గురించి ఇలాంటి వ్యాఖ్యలే చేసినపుడు జగన్ వాటిని ఖండించలేదన్నారు. వారికి బుద్ధి చెప్పలేదన్నారు. అంబటి చంద్రబాబును అంత నీచంగా మాట్లాడితే తమకు విపరీతమైన కోపం వచ్చిందన్నారు. కానీ.... తాము దిగజారి మాట్లాడలేదన్నారు. తప్పు చేసిన అంబటిని వైసీపీ నుండి ఎందుకు సస్పెండ్ చేయడం లేదు జగన్ అని నిలదీశారు. అంబటి లాంటి వ్యక్తి చేసిన తప్పుకు అతన్ని పార్టీ నుండి సస్పెండ్ చేయకుండా.....అతన్ని భుజాన వేసుకుని మాట్లాడడం దుర్మార్గమన్నారు. సాక్షి ఛానల్ లో ఒక అనలిస్టు, వైసీపీ కార్యకర్త రాజధాని అమరావతిలో ఉన్న మహిళలను వేశ్యలంటా వ్యాఖ్యానించి, అవమానిస్తే....అతన్ని కూడా జగన్ మెచ్చుకుని మహిళలను అవమానించాడన్నారు. జగన్ మీకు, మీ నాయకులకు, అంబటికి ఇంట్లో మహిళలు లేరా? మీకు ఆడబిడ్డలు లేరా? మీ ఆడబిడ్డల గురించి ఇలాగే మాట్లాడితే మీరు ఊరుకుంటారా? చంద్రబాబు గురించి ఎవ్వరైనా పిచ్చి కూతలు కూస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంబటి రాంబాబు ఎక్కడ కనిపించినా చెప్పుల దాడి తప్పదన్నారు. దీనికోసం చట్టపరమైన చర్యలకు కూడా సిద్ధ అన్నారు. అవసరమైతే జైలుకు కూడా వెళతామని స్పష్టం చేశారు. తమ నాయకుడి గురించి మేం ఎంతవరకైనా వెళతామన్నారు. జైళ్లు, పోరాటాలు మాకు కొత్త కాదు. మా అధినేతకు అవమానం జరిగితే చూస్తూ ఊరుకోం. జగన్ అంబటిని వైసీపీ నుండి సస్పెండ్ చేయాలి....మహిళల గౌరవాన్ని కాపాడాలి. అంబటిని కాపాడుకుంటాం అని అంటున్న జగన్ కి సిగ్గుందా? అంబటి ఏమైనా స్వాతంత్ర్య పోరాటం చేశాడా కాపాడుకోవడానికి? చంద్రబాబుగారి క్రమశిక్షణ, మౌనం, సహనం జగన్ వైసీపీ నేతలకు చేతకానితనంలా కనిపిస్తుందని కానీ తాము ఊరుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు. అంబటి మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే....ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని హెచ్చరించారు. మా ఆవేశం కట్టలు తెంచుకుంటే.....అంబటి ఇంటికే కాదని, జగన్ ఇంటికి కూడా వస్తాం అని హెచ్చరించారు.

# టీడీపీతోనే కురుబలకు గుర్తింపు

**కనకదాసు విగ్రహావిష్కరణ సభలో మంత్రి సవిత వెల్లడి**



సోమందేపల్లి, (చైతన్యరథం): కురుబల ను గుర్తించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని కురుబలు అన్ని రంగాల్లో రాణించాలని విద్యతోనే అభివృద్ధి సాధ్యమని" అని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ స్పష్టం చేశారు. సోమందేపల్లి మండల కేంద్రంలో కురుబల ఆరాధ్యదైవం శ్రీభక్తకనకదాసు విగ్రహాన్ని ఎంపీ బీకే పార్థసారథి సీపీఐ జిల్లా అధ్యక్షుడు జగదీశ్ శ్రీధర్‌తో కలసి విగ్రహాన్నిఆవిష్కరించారు. అంతక ముందు పట్టణంలోని కొత్తపల్లి క్రాస్ నుండి కనకదాసు విగ్రహం వరకు పెద్ద ఎత్తున జ్యోతుల మోస్తూ ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి సవితమ్మ మాట్లాడుతూ కురుబ కులస్తులు విద్య, ఉద్యోగం, వ్యాపారం రాజకీయం – అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండాలన్నారు. కురుబ కులస్తుల చిరకాలంగా ఎదురుచూస్తున్న శ్రీ భక్త కనకదాసు జయంతిని అధికారకంగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించడానికి శాశ్వత జీవో కూడావిడుదల చేశామన్నారు. అదేవిధంగా గుడికట్ల పూజారుల గౌరవేతనం ధూప దీప నైవేద్యాలకు ,అందచేయబోతున్నామన్నారు. ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ద్వారా వివరాలు సేకరిస్తున్నామన్నారు. విద్యతోనే కురుబల అభివృద్ధి సాధ్యమని ఐక్యమత్యంతో కురుబలు మెలగాల్సిన అవసరముందన్నారు. కురుబ, సామాజిక వర్గీయుంతా ఒక్కటేనని, వారంతా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. విద్యతోనే పేదరికం దూరమవుతుందని, అన్ని రంగాల్లోనూ ఉన్నతి సాధ్యమవుతుందని తెలిపారు. అదేవిధంగా సోమందేపల్లి మండల కేంద్రంలో నిర్మించ బోయే కనకదాసు కళ్యాణ మండపం కోసం నా సొంత నిధులతో 10 లక్షల రూపాయలు అందచేస్తానని మంత్రి సవితమ్మ తెలిపారు. సోమందేపల్లి కురుబ సంఘం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని 10వ తరగతిలో ఉత్తీర్ణులైన నిరుపేద కురుబ కుటుంబ కుటుంబాలకు కురుబ సంగం అండగా ఉండటం ఎంతో అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాకురవ సంఘం నాయకులు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున కురుబ కులస్తులు పాల్గొన్నారు.

# నోరు జారితే....
# మీ తాటతీసి పాతరేస్తాం

**అంబటి, జోగీలకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ హెచ్చరిక**



అమరావతి, (చైతన్యరథం): రాజకీయాల్లో అంబటి జోగి లాంటి వ్యక్తుల మాటలకు తావుండదని చంద్రబాబు లోకేష్‌లపై అంబటి రాంబాబు జోగి రమేష్ లు చేసిన వ్యాఖ్యలు నీచ రాజకీయాలకు నిదర్శనమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తీవ్రంగా ఖండించారు. అమరావతిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశమంతా తిరుమలలో కల్తీ నెయ్యి గురించి చర్చించుకుంటుంటే జోగి రమేష్ అంబటి రాంబాబులు బూతులు తిడుతూ టాఫిక్ డైవర్షన్ చేయాలని వైసిపి నేతలు కుట్రకు తెర తీశారని ఆయన విమర్శించారు చంద్రబాబు లోకేష్ ల గురించి మాట్లాడే అర్హత అంబటి రాంబాబు జోగి రమేష్‌లకు లేదని ఆయన విమర్శించారు అంబటి రాంబాబు, జోగి రమేష్ లతో జగన్ ఆడిస్తున్న డ్రామా అని ఆయన విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన పాపాన్ని ప్రశ్నిస్తే సమాధానం చెప్పే దమ్ము లేక రోడ్లమీద పడి నీచ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు అంబటి జోగి రమేష్ ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని ఆయన హెచ్చరించారు. వైసీపీ నేతలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. రాష్ట్రంలో ఎవరైనా సరే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు వైసిపి దిగుదారుడు రాజకీయాలకు ఇది పరాకాష్ట అని ఆయన అన్నారు చంద్రబాబు జోలికి వస్తే తాటతీస్తామని హెచ్చరించారు.

# మూడు కర్తవ్యాల స్ఫూర్తితో బడ్జెట్

- ఏడు నగరాల మధ్య హైస్పీడ్ కారిడార్లు
- డేటా సెంటర్ల ఏర్పాటు సంస్థలకు శుభవార్త
- కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లకు శ్రీకారం
- టూరిజం అభివృద్ధికి కార్యాచరణ
- ఇకపై విదేశీ ఆస్తులు వెల్లడించడం తప్పనిసరి
- జిల్లాకో బాలికల వసతిగృహం
- పన్ను వివాదాల్లో జైలుశిక్ష రెండేళ్లకు తగ్గింపు
- మహిళల ఆర్థికాభివృద్ధికి పథకాలు



న్యూఢిల్లీ: 2026- 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌ను మూడు కర్తవ్యాల స్ఫూర్తితో తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఆ మూడు కర్తవ్యాలను వివరించారు. సమ్మిళిత ఆర్థిక వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, సబ్ కా సాత్.. సబ్ కా వికాస్. వికసిత్ భారత్‌లో భాగంగా యువత ఆకాంక్షలకు అద్దం పట్టేలా బడ్జెట్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. జీఎస్టీ, లేబర్ కోడ్, తదితర రంగాల్లో సంస్కరణలు తెచ్చినట్లు చెప్పారు. ఈ బడ్జెట్లో రక్షణ రంగానికి పెద్ద పీట వేశారు. అలాగే మౌలిక సదుపాయల కల్పనకు భారీగా నిధులు కేటాయించారు. ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను కేంద్రం ప్రకటించగా.. అందులో మూడు హైదరాబాద్ మీదుగా వెళ్తుండటం విశేషం. అలాగే మానసిక ఆరోగ్యంపైనా ఈ బడ్జెట్‌లో ఫోకస్ పెట్టారు. క్యాన్సర్ చికిత్సలో వాడే 17 రకాల ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా రద్దు చేశారు. అలాగే మరో ఏడు అరుదైన వ్యాధుల మందులు, స్పెషల్ మెడిసన్ ఫుడ్ దిగుమతిపైనా కస్టమ్స్ సుంకాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఉత్పాదకతను మెరుగు పరచడం, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. వరుసగా తొమ్మిదో సారి లోక్‌సభలో వార్షిక బడ్జెట్ 2026ను ప్రవేశపెట్టి 85 నిమిషాల సేపు ప్రసంగించారు. 21వ శతాబ్దం పూర్తిగా టెక్నాలజీ ఆధారితంగా నడుస్తోందని, అందువల్ల సాంకేతికతను సామాన్యుడిగా కూడా అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉంటుందని తెలిపారు. ఈ దిశగా టైర్ 2, టైర్ 3 నగరాల అభివృద్ధికి ఏటా రూ.1,000 కోట్ల చొప్పున కేటాయిస్తున్నాయని చెప్పారు.

**మినరల్స్ కారిడార్లు**

సెమీకండక్టర్ రంగంలో రెండు కీలకమైన ప్రకటనలను బడ్జెట్‌లో ప్రకటించారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో రేర్ ఎర్త్ కేరిడార్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందుకోసం రూ.40,000 కోట్లు పెట్టుబడులు పెడతామని తెలిపారు.

**కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు**

యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఉపాధి, విద్యారంగాల్లో సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా కంటెంట్ క్రియేషన్ రంగంలో భారత్ ప్రపంచ హబ్‌గా ఎదగడానికి 15,000 కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ముంబైలో ప్రతిపాదించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ దేశీయ ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేలా రూపొందించబడుతుంది. చదువును నేరుగా ఉపాధితో అనుసంధానం చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

**విదేశాల్లో విద్యార్థులకు శుభవార్త**

విదేశాల్లో ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఈ బడ్జెట్‌లో ఊహించని శుభవార్త అందింది. విదేశీ నగదు బదిలీలపై గతంలో ఉన్న 5-20 శాతం టీసీఎస్ పన్నును భారీగా తగ్గిస్తూ కేవలం 2 శాతానికి పరిమితం చేశారు. దీనివల్ల విదేశీ ఫీజులు చెల్లించే తల్లిదండ్రులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుంది. అలాగే బాలికల కోసం ప్రతి జిల్లాలో కనీసం ఒక హాస్టల్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**పీపీపీ పద్ధతిలో మెడికల్ హబ్‌లు**

ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారు. ప్రతి జిల్లా ఆసుపత్రిలో అత్యవసర చికిత్స విభాగాలను ఆధునీకరించనున్నారు. ముఖ్యంగా దేశంలో పెరుగుతున్న మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం ఉత్తర భారతదేశంలో ప్రత్యేక మానసిక ఆరోగ్య సంస్థలను నెలకొల్పుతారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయడానికి పీపీపీ పద్ధతిలో ఐదు ప్రాంతీయ మెడికల్ హబ్‌లను అభివృద్ధి చేస్తారు.

**ఏడు కొత్త హై-స్పీడ్ రైలు కారిడార్లు**

రైల్వే రంగంలో విప్లవాత్మక మార్పుగా ఏడు కొత్త హై-స్పీడ్ రైలు కారిడార్లను ప్రభుత్వం ప్రక టించింది. వీటిలో హైదరాబాద్‌ను అనుసంధానిస్తూ మూడు కారిడార్లు (హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-పూణే) ఉండటం విశేషం. ఈ ప్రాజెక్టుల వల్ల ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయి.

**ఐదు మెడికల్ టూరిజం హబ్‌లు**

ఈ బడ్జెట్ తక్షణ ఉపశమనం కంటే దేశ భవిష్యత్తు అభివృద్ధికి పునాదులు వేసేలా ఉంది. తయారీ రంగాన్ని పటిష్టం చేయడం, సాంకేతికతను విద్యతో జోడించడం ద్వారా వికసిత్ భారత్ దిశగా అడుగులు వేస్తోంది. పర్యాటక రంగంలో కూడా ఐదు మెడికల్ టూరిజం హబ్‌ల ద్వారా విదేశీయులను ఆకర్షించి దేశ ఆదాయాన్ని పెంచే వ్యూహం ఇందులో కనిపిస్తుంది.

**ఏ రంగానికి ఎంత కేటాయింపులు**

రవాణా రంగం - రూ.5,98,520 కోట్లు
రక్షణ రంగం - రూ.5,94,585 కోట్లు
గ్రామీణాభివృద్ధి - రూ.2,73,108 కోట్లు
హోంశాఖ - రూ.2,55,234 కోట్లు
వ్యవసాయం - రూ.1,62,671 కోట్లు
విద్యా రంగం - రూ.1,39,289 కోట్లు
ఇంధన రంగం - రూ.1,09,029 కోట్లు
ఆరోగ్య రంగం - రూ.1,04,599 కోట్లు
పట్టణాభివృద్ధి - రూ.85,522 కోట్లు
కామర్స్ అండ్ ఇండస్ట్రీ - రూ.70,296 కోట్లు
సోషల్ వెల్ఫేర్ - రూ.62,362 కోట్లు
సైంటిఫిక్ డెవలప్‌మెంట్ - రూ.55,756 కోట్లు
ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్ - రూ.45,500 కోట్లు
విదేశీ వ్యవహారాలు - రూ.22,119 కోట్లు
ఫైనాన్స్ - రూ.20,649
ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి-రూ.6,812 కోట్లు

**ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం**

64 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం సరికొత్త 'ఆదాయపు పన్ను చట్టం-2025'ను తీసుకొచ్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026 బడ్జెట్‌లో దీనికి సంబంధించి కీలక మార్పులను ప్రకటించారు. ఈ కొత్త చట్టం ఏప్రిల్ 1, 2026 నుంచి అమలులోకి రానుంది. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా, ట్యాక్స్ ఫైలింగ్‌ను సులభతరం చేసేలా దీనిని రూపొందించారు. గతంలో 819గా ఉన్న సెక్షన్లను 536కు తగ్గించారు. 47 అధ్యాయాల నుంచి 23కు కుదించడం ద్వారా చట్టాన్ని మరింత స్పష్టంగా మార్చారు. సుదీర్ఘమైన వివరణలకు బదులుగా, పన్ను లెక్కించడానికి 39 పట్టికలు 40 ఫార్ములాలను చేర్చారు. 'ట్యాక్స్ ఇయర్' విధానం రూపొందించారు. రెండింటినీ కలిపి ఒకే 'టాక్స్ ఇయర్' ప్రభుత్వం మార్చింది. సరళతరమైన ఐటీఆర్ ఫారాలు రూపొందించారు. పన్ను చెల్లింపు దారులు గంటల తరబడి కుస్తీ పట్టాల్సిన అవసరం లేకుండా త్వరలోనే కొత్త ఐటీఆర్ ఫారాలను అందుబాటులోకి తెస్తున్నారు. మీ జీతం, బ్యాంక్ వడ్డీ వంటి వివరాలు ఇప్పటికే ఫారంలో నింపి ఉంటాయి. మీరు కేవలం వాటిని సరిచూసుకుని 'సబ్మిట్' చేస్తే సరిపో తుంది. పన్ను నోటీసుల జారీ, అప్పీళ్ల ప్రక్రియలో వేగాన్ని పెంచడానికి ఏఐ సాంకేతికతను ఉపయో గిస్తున్నారు.

**మహిళలకు గుడ్‌న్యూస్**

2024-25 బడ్జెట్‌లోనే ఈ లక్‌పతీ దీదీ యోజనను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ స్కీమ్ ద్వారా 2 కోట్ల మంది మహి ళలకు ఆర్థిక సాయం అందించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్రం తెలిపింది. ఆ తర్వాత ఈ టార్గెట్‌ను 3 కోట్లకు పెంచారు. ఇప్పుడు మరోసారి ఈ స్కీమ్ పొడిగించారు. సొంతం గా వ్యాపారం చేయాలనుకునే మహిళలకు ఏకంగా రూ.5 లక్షల వరకు ఎలాంటి వడ్డీ లేకుండా లోన్ ఇస్తారు. స్వయం సహాయక బృందాల్లో ఉన్న మహిళలకు మాత్రమే ఈ రుణాలు అందిస్తారు.

## 140 కోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం



వార్షిక బడ్జెట్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. ఇది చరిత్రాత్మక బడ్జెట్ అని అభివర్ణించారు. వరుసగా తొమ్మిది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఏకైక మహిళా ఆర్థిక మంత్రిగా అరుదైన రికార్డును నిర్మలా సీతా రామన్ సొంతం చేసుకున్నారు. ఈ బడ్జెట్ 'పుష్కలమైన అవకాశాలకు హైవే' అని ప్రశంసించారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను వాస్తవ రూపంలోకి తీసుకొచ్చేలా భారతదేశ ఉజ్వల భవితకు గట్టి పునాదిని వేసింది. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ వేగానికి ఊతమిచ్చే రోడ్‌మ్యాప్ అని తెలిపారు.



## ధరలు తగ్గేవి...

- విదేశీ పర్యాటక ప్యాకేజీలు: వీటిపై ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ (టీసీఎస్) 2శాతానికి తగ్గింపు
- విదేశీ విద్య: దీనిపై టీడీఎస్ లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్దర్ఎస్) కింద విద్యా ఖర్చులు కోసం తగ్గించారు.
- ఆల్కహాలిక్ లిక్కర్ తుక్కు కొన్ని రకాల ఖనిజాలు: వీటిపై కస్టమ్స్ డ్యూటీని 5శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు.
- షూ అప్పర్ ఎగుమతులు: ఇందుకోసం అవసరమైన మెటీరియల్ దిగుమతిని డ్యూటీ రహితంగా ప్రకటించారు.
- సోలార్ ప్యానల్స్: వీటికి సంబంధించిన కీలక మెటీరియల్పై బీసీడీ (బేసిక్ కస్టమ్స్ డ్యూటీని)ని తొలగించారు.
- ఎనర్జీ ట్రాన్సిషన్ పరికరాలు: వీటిపై బీసీడీ తొలగింపు.
- క్యాపిటల్ గూడ్స్, క్రిటికల్ మినరల్స్‌పై బీసీడీ మినహాయింపు.
- వ్యక్తిగత వినియోగానికి వాడే పరికరాలపై బీసీడీ 20 నుంచి 10 శాతానికి కుదింపు.
- క్యాన్సర్, అరుదైన వ్యాధులు, డయాబెటిక్ చికిత్సకు వాడే 17 ఔషధాలపై బీసీడీ తొలగింపు
- తీరప్రాంతం నుంచి ప్రత్యేక ఆర్థికమండలి పరిధి వరకు సముద్ర జలాల్లో జాలర్లు పట్టే చేపలు.
- అణు విద్యుత్తు ప్రాజెక్టులకు వాడే పరికరాలు.
- విద్యుత్తు వాహనాల్లో వాడే బ్యాటరీలు.
- భారత్లో తయారయ్యే స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు
- విమానాల విడిభాగాలు.

## రైల్వేకు పెద్దమొత్తంలో నిధులు



దేశ రవాణాకు ఆయువుపట్టులాంటి భారతీయ రైల్వేకు ఈసారి బడ్జెట్‌లో పెద్దమొత్తంలో నిధులు కేటాయించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం కోసం రూ.2,77,830 కోట్లను ప్రత్యేకించారు. గతేడాది (2025-26) కేటాయించిన రూ.2,52,000 కోట్లతో పోలిస్తే ఈ మొత్తం దాదాపు 10.25 శాతం అదనం. ఈ నిధులకు అదనంగా మరో రూ.15 వేల కోట్లు బడ్జెటేతర నిధులు రైల్వే శాఖకు సమకూరనున్నాయని బడ్జెట్ ప్రతుల్లో కేంద్రం పేర్కొంది.

## ధరలు పెరిగేవి..



- ఆదాయపు వివరాలు సరిగ్గా చూపని వారికి విధించే జరిమానా 100% పెంపు
- బహిర్గతం చేయని చరాస్థులపై ఇప్పుడు జరిమానా విధింపు
- ఫ్యూచర్స్-ఆప్షన్స్ ట్రేడింగ్
- విలాసవంతమైన వాచ్లు, ఆల్కహాల్, సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా, గుట్కా
- కాఫీ రోస్టింగ్, వెండింగ్ యంత్రాలు
- ఆమోనియం ఫాస్ఫేట్, ఆమోనియం నైట్రో ఫాస్ఫేట్ వంటి వాటి ధరలు పెరగొచ్చు.
- చిత్రీకరణకు వాడే పరికరాలు, కెమెరాలు ధరలు పెరిగే అవకాశం.



## స్టాక్ మార్కెట్ కుదేల్

బడ్జెట్ వేళ దేశీయ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. నూతన బడ్జెట్‌లో కంపెనీల బై బ్యాక్‌పై పన్ను విధించడం సహా ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను 0.05 శాతానికి పెంచడంపెంచడం మార్కెట్ల పతనానికి కారణమైంది. ఒకానొక దశలో 2400 పాయింట్లకు పైగా పతనమై 80 వేల దిగువకు చేరిన సెన్సెక్స్.. చివరకు 1546 పాయింట్లు పతనమై 80,722 వద్ద స్థిరపడింది. 495 పాయింట్ల భారీ నష్టాన్ని చవిచూసిన నిఫ్టీ.. 24,119 వద్ద ముగిసింది. బడ్జెట్ నేపథ్యంలో ఆదివారం అయి నప్పటికీ పనిచేసిన మార్కెట్లు మదుపర్లకు బ్లాక్ సండేను మిగిల్చాయి.

# ఇప్పుడు పవర్ భారత్ చేతుల్లో: ఎలాన్ మస్క్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలతో ప్రపంచ దేశాలు అతలాకుతలం అవుతున్నాయి. అయితే, చిక్కుల్లో ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రస్తుతం చైనా, భారత్‌లు చోదక శక్తులుగా అవతరించాయని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) గణాంకాలు చెబుతున్నాయి. ఈ పరిణామంపై అపరకుబేరుడు ఎలాన్ మస్క్ (జుశ్రీశీఅ వీబంఎ) స్పందించారు. పవర్ ఇప్పుడు చైనా, భారత్ చేతుల్లోకి వెళుతోందని కామెంట్ చేశారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థను ముందుండి నడిపిస్తున్న టాప్ 10 దేశాల జాబితాను ఎలాన్ మస్క్ నెట్టింట పంచుకున్నారు. ఈ జాబితాను ఐఎమ్ఎఫ్ విడుదల చేసింది. దీని ప్రకారం ప్రపంచ జీడీపీలో 26.6 శాతం



వాటాతో చైనా నెం.1గా నిలిచింది. రెండో స్థానంలో ఉన్న భారత్ వాటా 17.0 శాతం. ఇక మూడో స్థానానికి పరిమితమైన అమెరికా వాటా కేవలం 9.9 శాతం. అంటే.. చైనా, భారత్‌లు కలగలిసి ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో 43.6 శాతం వాటాను సొంతం చేసుకున్నాయి.

**మస్క్ ఆసక్తికర కామెంట్**

ఈ గణాంకాలపై మస్క్ ఆసక్తికర కామెంట్ చేశారు. ప్రపంచంలో పవర్ చేతులు మారుతోందని అన్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం, 2026లో ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు 3.3 శాతంగా ఉండనుంది. 2027లో వృద్ధిరేటు 3.2 శాతంగా ఉండనుంది. ఆధునిక సాంకేతికతలపై పెట్టుబడుల వెల్లువ, ప్రభుత్వాల విత్త, ద్రవ్యపరపతి విధానాల మద్దతు, శక్తిమంతంగా ఉన్న ప్రైవేటు రంగాల కారణంగా ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతోందని ఐఎమ్ఎఫ్ తెలిపింది. ట్రంప్ సుంకాల ప్రభావాన్ని తట్టుకోవడంలో అనేక దేశాలకు ఇవి కీలకంగా మారాయని తెలిపింది. ఇక 2025 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వృద్ధి రేటు 7.3 శాతంగా ఉండనుందని అంచనా. అయితే, ఈ ఏడాది, వచ్చే ఏడాది 6.4 శాతం వృద్ధి రేటు సాధిస్తుందని ఐఎమ్ఎఫ్ చెబుతోంది. చైనాలో ద్రవ్యోల్బణం కాస్త పెరుగుతుందని, భారత్‌లో మాత్రం ప్రభుత్వ అంచనాలకు లోబడే ఉంటుందని తెలిపింది.

# అమెరికా ఆర్థిక శాఖపై ట్రంప్ దావా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ దేశ అంతర్గత రెవెన్యూ సేవలు, ఆర్థిక శాఖపై ఫ్లోరిడా ఫెడరల్ కోర్టులో దావా వేశారు. ట్రంప్‌తో పాటు ఆయన ఇద్దరు కుమారులకు సంబంధించిన వ్యాపార, వ్యక్తిగత పన్ను రిటర్న్‌ల సమాచారం లీక్ కాకుండా ఆర్థిక శాఖ, ఐఆర్ఎస్‌లు విఫలమయ్యాయని ట్రంప్ ఆరోపించారు. ఈ మేరకు 10 బిలియన్ డాలర్ల పరిహారం కోరుతూ పిటిషన్ వేశారు. వ్యక్తిగత సమాచారం లీక్ చేసిన చార్లెస్ లిటిల్‌జాన్‌కు ఇప్పటికే కోర్టు 2024లో ఐదేళ్ల జైలుశిక్ష విధించింది. 2018-2020 మధ్య కాలంలో అప్పటి ఐఆర్ఎస్ కాంట్రాక్టర్ చార్లెస్ లిటిల్‌జాన్.. ట్రంప్ పన్ను పత్రాలను అపహరించి 'న్యూయార్క్ టైమ్స్', 'ప్రో పబ్లికా' వంటి మీడియా సంస్థలకు అందించినట్లు ప్రాసిక్యూషన్ అభియోగం. ఇది 'ప్రైవసీ యాక్ట్' ఉల్లంఘన అని ట్రంప్ తరుపు న్యాయవాది కోర్టులో పరిహారం కోరుతూ దావా వేశారు. ట్రంప్ కుమారులు డొనాల్డ్



ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్ తోపాటు 'ట్రంప్ ఆర్గనైజేషన్' తరఫున 10 బిలియన్ డాలర్ల పరిహారం కోరుతూ లాయర్ దావా వేశారు. లిటిల్‌జాన్ చేసిన లీకేజ్ వల్ల 2020 ఎన్నికల సమయంలో తన రాజకీయ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని, మీడియా సంస్థలు తనపై తప్పుడు ప్రచారం చేశాయని ట్రంప్ ఆరోపిస్తున్నారు. లిటిల్‌జాన్‌కు జైలు శిక్ష విధించిన నేపథ్యంలో ఆయన పనిచేసిన బుజ్ అలన్ హ్యామిల్టన్ సంస్థతో అమెరికా ఆర్థిక శాఖ ఈ వారం తెగతెంపులు చేసుకుంది. అయితే, ట్రంప్‌తో పాటు అమెరికాకు చెందిన వేల మంది ధనికుల ట్యాక్స్‌లకు సంబంధించిన వివరాలు లిటిల్ జాన్.. మీడియా సంస్థలకు అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ట్రంప్ వ్యవహారం అమెరికా రాజకీయాల్లో, న్యాయవర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది.

# చాబహార్ పోర్టుకు నిధుల కేటాయింపు లేదు!



అమెరికా ఆంక్షల నేపథ్యంలో భారత కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో కీలక మార్పు తీసుకొచ్చింది. ఇరాన్‌లో అభివృద్ధి చేస్తున్న చాబహార్ పోర్టుకు తాజా బడ్జెట్‌లో కేంద్రం ఎలాంటి కేటాయింపులూ చేయలేదు. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరిన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. వాణిజ్య పరంగా చాబహార్ పోర్టు భారత్‌కు ఎంతో కీలకం. పాక్‌తో చిక్కులు లేకుండా ఈ పోర్టు ద్వారా భారత వాణిజ్యం ఇరాన్, అఫ్ఘానిస్థాన్ మీదుగా మధ్య ఆసియా దేశాల వరకూ విస్తరించింది. పోర్టు అభివృద్ధికి భారత్ గత కొన్నేళ్లుగా ఏటా సగటున రూ.100 కోట్ల వరకూ కేటాయిస్తోంది. పాక్‌లోని గ్వదార్ పోర్టును చైనా అభివృద్ధి చేస్తుంటే భారత్ తన దృష్టి చాబహార్ పోర్టుపై కేంద్రీకరించింది. పాశ్చాత్య ఆంక్షలను తట్టుకుని నిలబడేందుకు ఈ పోర్టు ఇరాన్‌కూ కీలకమే. ఈ పోర్టు ద్వారా ఇరాన్‌కు అనేక ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాలు అందుబాటులో ఉంటాయి. చాబహార్ పోర్టు అభివృద్ధిపై భారత్ దాదాపు 2 దశాబ్దాలుగా కృషి చేస్తోంది. 2002లో తొలిసారిగా ఈ పోర్టు విషయంలో భారత్, ఇరాన్ మధ్య చర్చలు మొదలయ్యాయి. ఆ మరుసటి ఏడాది ఇరు దేశాల మధ్య సహకారం కోసం ఒప్పందం కుదిరింది. ఆ తరువాత 1996లో అఫ్ఘానిస్థాన్ తాలిబాన్ల పరమయ్యాక పరిణామాలు వేగంగా మారాయి. అప్పట్లో తాలిబాన్లను వ్యతిరేకించిన భారత్, ఇరాన్ మధ్య దౌత్య బంధం మరింత బలపడింది. ఇక పాక్‌లోని గ్వదార్ పోర్టుపై చైనా దృష్టిపెట్టాక భారత్ చాబహార్ పోర్టుకు మరింత వ్యూహాత్మక ప్రాధాన్యమిచ్చింది. అయితే, ఇరాన్ అణుకార్యకలాపాలు చేపడుతోందని ఆరోపిస్తూ అమెరికా గతేడాది సెప్టెంబర్‌లో ఆర్థిక ఆంక్షలకు తెరతీసింది. భారత్‌కు మాత్రం ఆరు నెలల పాటు మినహాయింపును ఇచ్చింది. ఈ గడువు ఏప్రిల్ 26తో ముగియనుంది.

# తానా న్యూజెర్సీ ఆధ్వర్యంలో ఆహారదానం

ఎడిసన్, న్యూజెర్సీ: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) న్యూజెర్సీ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమాజ సేవా ఆహార దాన కార్యక్రమం విజయవంతమైంది. సమాజ సేవ, సామాజిక బాధ్యత పట్ల తానాకు ఉన్న దీర్ఘకాలిక నిబద్ధతకు ఈ కార్యక్రమం మరో ఉదాహరణగా నిలిచింది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 1,800 పౌండ్ల ఆహారాన్ని సేకరించి, న్యూజెర్సీ కమ్యూనిటీ ఫుడ్ బ్యాంక్ ద్వారా దాదాపు 300 కుటుంబాలకు నిర్వాహకులు అందజేశారు. సేకరించిన ఆహారాన్ని ఎడిసన్, న్యూజెర్సీలోని Hands of Hope కేంద్రానికి తరలించి, అక్కడ వాలంటీర్లు కలిసి ఆహార పదార్థాలను వర్గీకరించి, ప్యాక్ చేసి పంపిణీకి సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి సౌత్ బ్రన్స్విక్‌లోని ఈస్ట్ మీడో ఎస్టేట్స్‌తో పాటు ప్రాంతంలోని పలువురు దాతలు ఉదారంగా సహకరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వంశీ చంద్ర నరేపలుపు, అనిత్ రాంపురం, వర్షా చంద్ర నరేపలుపు ఆహార సేకరణ, ఏర్పాటు పనుల్లో చురుగ్గా పాల్గొని, యువతలో సేవాభావాన్ని పెంపొందించాలనే తానా లక్ష్యాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమం సజావుగా నిర్వహించడంలో సుధీర్ జి. రాంపురం, సుందర్ బి. గోపీనాథ్, ప్రవీణ్ కల్వకొల్లు, దశరథ తలపనేని వంటి తానా వాలంటీర్లు ఎంతో శ్రమించి తమ సేవలను అందించారు. తానా నాయకత్వ సభ్యులు కూడా ఈ కార్యక్రమానికి తమ మార్గనిర్దేశనం, సహకారం అందించారు. తానా ట్రెజరర్



రాజా కసుకుర్తి, న్యూజెర్సీ రీజినల్ కోఆర్డినేటర్ సుధీర్ చంద్ర నరేపలుపు, ఫౌండేషన్ ట్రెజరర్ శ్రీనివాస్ ఒరుగంటి, ఫౌండేషన్ ట్రస్టీ సతీష్ మేకా, యూత్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ చెరుకూరి ఈ కార్యక్రమంలో పాల్గొని తానా సమాజ సేవా సంకల్పాన్ని మరింత బలపరిచారు. ఈ కార్యక్రమానికి తానా అధ్యక్షులు నరేన్ కొడాలి, తానా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు అభినందనలు తెలియజేస్తూ, న్యూజెర్సీ బృందం చేసిన సేవలను ప్రశంసించారు. అలాగే ఝఅసం శీట ఎశీజూవ నిర్వాహకులు చార్లీ, రాజ్, కుష్ కూడా అవసరంలో ఉన్నవారికి సహాయం చేసినందుకు తానా వాలంటీర్ల కృషిని అభినందించారు.



## బలూచ్‌లో భారీ హింస

### 88 మందికి పైగా మృతి

ఇస్లామాబాద్/కరాచీ: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ రాష్ట్రం తీవ్రస్థాయి హింసాత్మక ఘటనలతో మరోసారి నెత్తురోడింది. రాష్ట్రంలో పెద్దఎత్తున చెలరేగిన ఘర్షణల్లో కనీసం 67 మంది ఉగ్రవాదులు, 10 మంది భద్రతా సిబ్బంది, 11 మంది పౌరులు మృతిచెందారు. మరణించిన ఉగ్రవాదుల్లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ)కి చెందిన కొంతమంది వేర్పాటు వాదులు కూడా ఉన్నట్లు అధికారులు, సంబంధిత మంత్రులు శనివారం వెల్లడించారు. పాకిస్థాన్‌లోని అతిపెద్ద రాష్ట్రమైన బలూచిస్థాన్ అనేక దశాబ్దాలుగా వేర్పాటువాదంతో అట్టుడుకుతోంది. నిరుడు దేశవ్యాప్తంగా 699 ఉగ్రదాడులు జరిగాయని, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 34శాతం అధికమని పాక్ తెలిపింది.

## గనిపై కొండచరియలు పడి కాంగోలో 227 మంది కార్మికుల మృతి



గోమా (కాంగో): మధ్య ఆఫ్రికా దేశమైన కాంగోలో పెను విషాదం చోటు చేసుకుంది. తూర్పు కాంగోలోని రుబాయా ప్రాంతంలో ఉన్న కొల్టాన్ గనులపై భారీగా కొండచరియలు విరిగిపడడంతో 227 మందికి పైగా కార్మికులు చనిపోయారు. ఈ ప్రాంతంలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఒక్కసారిగా కొండచరియలు గనిలోని సొరంగాల్లో పనిచేస్తున్న కార్మికులపై పడ్డాయి. దీంతో వారంతా అక్కడికక్కడే సజీవ సమాధి అయ్యారు.

## ప్రపంచమంతా తిరిగి అడుక్కుంటున్నాం

ఇస్లామాబాద: అప్పుల కోసం తాను, ఆర్మీ చీఫ్ అసీం మునీర్ కలిసి దేశాలు తిరుగుతున్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. 'మేమిద్దరం ప్రపంచమంతా తిరిగి డబ్బు అడుక్కోవడం సిగ్గుగా ఉంది. అప్పులు తీసుకోవడం మన ఆత్మగౌరవంపై పెద్ద భారం. సిగ్గుతో మేం తల వంచుకోవాల్సి వస్తోంది. ప్రతిగా వాళ్లు ఏం అడిగినా మనం కాదనలేం' అన్నారు. అయితే, దేశ ఆర్థిక స్థితి దృష్ట్యా అలా చేయాల్సి వస్తోందని వాపోయారు. ఇస్లామాబాద్‌లో దేశానికి చెందిన ప్రముఖ ఎగుమతిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం మన విదేశీ మారక ద్రవ్యం దాదాపు రెట్టింపు అయ్యింది. అయితే, ఇందులో మిత్రదేశాలు ఇచ్చిన రుణాలు కలిసి ఉన్నాయి' అని తెలిపారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) సంస్థతో పాకిస్థాన్ క్రియాశీలకంగా చర్చలు జరుపుతున్న తరుణంలో షెహబాజ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# అండర్-19 ప్రపంచ కప్ సెమీస్‌కు భారత్

- కీలకమ్యాచ్‌లో పాక్‌పై 58 పరుగులతో ఘన విజయం
- బ్యాటింగ్‌లో మెరిసిన వేదాంత్ త్రివేది



అండర్-19 ప్రపంచ కప్ -2026లో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. సూపర్ సిక్సెస్‌లో భాగంగా జింబాబ్వేలోని బులవాయోలో ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో భారత్ 58 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 253 పరుగుల లక్ష్యఛేదనలో పాక్.. 46.2 ఓవర్లలో 194 పరుగులకే ఆలౌటైంది. ఉస్మాన్ ఖాన్ (66), హంజా జహూర్ (42), ఫర్హాన్ యూసఫ్ (38) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో ఖిలాన్ పటేల్ 3, ఆయుష్ మాత్రే 3, అంబరీష్, హెనిల్ పటేల్, కనిష్క్ చౌహాన్, విహాన్ మల్హోత్రా తలో వికెట్ పడగొట్టారు. ఫిబ్రవరి 3న తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్.. ఫిబ్రవరి 4న రెండో సెమీ ఫైనల్లో భారత్, అఫ్ఘనిస్థాన్ తలపడనున్నాయి.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. 49.5 ఓవర్లకు 252 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాచ్ మొదలైనప్పటి నుంచి పరుగులు సాధించడానికి బ్యాటర్లు కాస్త తడబడ్డారు 47 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ టీమిండియాను.. వేదాంత్ త్రివేది(68) ఆదుకున్నాడు.

అతడే ఈ మ్యాచులో టాప్ స్కోరర్. టీమిండియా బ్యాటర్లలో ఆరోన్ జార్జ్(16), అభిజ్ఞాన్ కుందు(16) నిరాశపర్చారు. కెప్టెన్ ఆయుశ్ మాత్రే(0) పేలవమైన ఫామ్ మళ్లీ కొనసాగింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (30).. మరోసారి విఫలమయ్యాడు. కనిష్క్ చౌహాన్(35), అంబరిష్(29), విహాన్ మల్హోత్ర(21), ఖిలాన్ పటేల్(21) పర్వాలేదనిపించారు. పాకిస్థాన్ బౌలర్లలో అబ్దుల్ సుభాన్ 3, సయ్యం 2, అలీ రజా, అహ్మద్ హుస్సేన్, కమర్, అలీ హసన్ తలో వికెట్ పడగొట్టారు.



# తిలక్‌వర్మ ఫిట్‌నెస్ ఓకే..

టీ20 ప్రపంచ కప్ 2026 సమీపిస్తున్న తరుణంలో భారత్ అభిమానులకు గుడ్ న్యూస్. సర్జరీ కారణంగా టీ20 జట్టుకు దూరమైన స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ పూర్తి స్థాయిలో కోలుకున్నాడు. తాజాగా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మ్యాచ్ ఫిట్‌నెస్ టెస్ట్ పాసయ్యాడు. ఈ సర్జరీ కారణంగా తిలక్.. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌కు దూరమైన విషయం తెలిసిందే. బీసీసీఐ నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో తిలక్ వర్మ ఉత్తీర్ణత సాధించాడని వైద్య బృందం క్లియరెన్స్ ఇచ్చింది. అతడు మంగళవారం (ఫిబ్రవరి 3) ముంబైలో టీమిండియాతో కలవనున్నాడు. టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు భారత్ ఆడనున్న రెండు వార్మప్ మ్యాచుల్లో తిలక్ భాగం కానున్నాడు. మరోవైపు న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఆకట్టుకోలేకపోయిన సంజు శాంసన్ స్థానంలో ఇషాన్ కిషన్ ఆడటం లాంఛనమే. తిరువనంతపురం వేదికగా జరిగిన ఆఖరి టీ20లో ఇషాన్ సెంచరీతో చెలరేగిన విషయం తెలిసిందే. దీంతో ప్రపంచ కప్ జట్టులో ఇషాన్ స్థానం ఖాయమైనట్టే. కాగా తిలక్ వర్మ మూడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు.

ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచ కప్ 2026 జరగనుంది. ఈ మెగా టోర్నీలో భారత్ తన తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న ముంబై వేదికగా యూఎస్ఏతో తలపడనుంది. దానికి ముందు ఫిబ్రవరి 2న అమెరికా, ఫిబ్రవరి 4న సౌతాఫ్రికా జట్లతో టీమిండియా వార్మప్ మ్యాచులు ఆడనుంది.

# డబ్ల్యూపీఎల్ ప్లే ఆఫ్స్‌కు ఢిల్లీ

## - గుజరాత్‌పై 5 వికెట్లతో విజయం



డబ్ల్యూపీఎల్-2026లో ఢిల్లీ ప్లేఆఫ్స్‌కు చేరింది. ఆదివారం యూపీ వారియర్స్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్ లో 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనకు దిగిన ఢిల్లీ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వోల్వార్డ్ (47), షెఫాలీ వర్మ (29), జెమీమా రోడ్రిగ్స్ (34 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. యూపీ బౌలర్లలో దీప్తి శర్మ 2వికెట్లు పడగొట్టగా.. శిఖా పాండే, డాటిన్,ఎక్లిస్టన్ తలో వికెట్ తీశారు.

అంతకు ముందు యూపీ బ్యాటర్లలో దీప్తి శర్మ (24) టాప్ స్కోరర్‌గా నిలిచింది.. సిమ్రన్ షైక్ (22), శిఖా పాండే (23లి) ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ బౌలర్లలో మారిజేన్ కాప్ 3, శ్రీ చరణి 2, చినెల్లీ హెన్రీ 2, మిన్ను మణి ఒక వికెట్ తీశారు. తాజా విజయంతో 8 పాయింట్లతో మూడో స్థానంలోకి వెళ్లిన ఢిల్లీ జట్టు మంగళవారం గుజరాత్ తో ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్లు గెలిచిన టీమ్ ఆర్సీబీతో ఫైనల్లో తలపడుతుంది.

# ఆస్ట్రేలియా ఓపెన్ విజేత అల్కరాస్

## - కెరీర్ గ్రాండ్ స్లామ్ పూర్తి చేసిన పిన్న వయస్కుడిగా రికార్డ్



పురుషుల టెన్నిస్‌లో కెరీర్ గ్రాండ్ స్లామ్ పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడిగా ప్రపంచ నంబర్ వన్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) చరిత్ర సృష్టించాడు. ఆదివారం హోరాహోరీగా సాగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో నొవాక్ జకోవిచ్ (సెర్బియా)పై 2-6, 6-2, 6-3, 7-5 తేడాతో అల్కరాస్ విజయం సాధించాడు. 22 ఏళ్ల అల్కరాస్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్లో ఇది తొలి టైటిల్. అతను ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025), వింబుల్డన్ (2023, 2024), యూఎస్ ఓపెన్ (2022, 2025) సాధించాడు. మరోవైపు.. జకోవిచ్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఇది తొలి ఓటమి. అంతకుముందు ఈ టోర్నమెంట్లో ఫైనల్ చేరిన పదిసార్లూ అతడు విజేతగా నిలవడం విశేషం. టెన్నిస్ చరిత్రలో అత్యధిక (25) గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు సాధించాలనుకున్న జకోవిచ్ ఆశలపై అల్కరాస్ నీళ్లుచల్లాడు. ప్రస్తుతం 24 టైటిళ్లతో ఉన్న నొవాక్.. 25వ టైటిల్ కోసం చాలా కష్టపడుతున్నాడు. చివరగా 2023లో యూఎస్ ఓపెన్ గెలిచాక.. అతడు మళ్లీ గ్రాండ్ స్లామ్ కొట్టలేకపోతున్నాడు.

## మూడో టీ 20లో

# విండీస్ గెలుపు

## - 2-1తో సిరీస్ గెలుచుకున్న సౌతాఫ్రికా

జోహన్నెస్బర్గ్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన మూడో టీ20లో వెస్టిండీస్ 6 పరుగుల తేడాతో (డక్ వర్త్ లూయిస్ పద్ధతి) విజయం సాధించింది. దీంతో క్లీన్ స్వీప్ ప్రమాదం నుంచి విండీస్ తప్పించుకుంది. వర్షం, మెరుపులు కారణంగా ఈ మ్యాచ్‌ను 10 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. విండీస్ ఇన్నింగ్స్ లో కెప్టెన్ షాయ్ హోప్(25 బంతుల్లో 48), షిమ్రాన్ హెట్‌మెయర్ (22 బంతుల్లో 48 పరుగులు) మెరుపు ఇన్నింగ్సులు ఆడారు. సఫారీ బౌలర్లలో ఎంగిడీ, మఫాక, కేశవ్ మహారాజ్ తలా వికెట్ సాధించారు.

అనంతరం డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం.. దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని 10 ఓవర్లలో 125 పరుగులుగా నిర్ణయించారు. లక్ష్య చేధనలో కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్ త్వరగా ఔటైనప్పటికి క్వింటన్ డికాక్ (28) శుభారంభం ఇచ్చాడు. కానీ వరుస క్రమంలో వికెట్లు కోల్పోవడంతో దక్షిణాఫ్రికా ఓటమి చవిచూడాల్సి వచ్చింది. విండీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో సఫారీలు 6 వికెట్లు కోల్పోయి 118 పరుగులకే పరిమితమయ్యారు. కరేబియన్ బౌలర్లలో గుడికేష్ మోటీ మూడు వికెట్లతో సత్తాచాటాడు. అయితే తొలి రెండు టీ20ల్లో విజయం సాధించిన సౌతాఫ్రికా.. సిరీస్ ను 2-1 తేడాతో సొంతం చేసుకుంది.

# బంగ్లాలో కొత్త టీ 20 టోర్నమెంట్

టీ20 ప్రపంచ కప్ 2026కు దూరమైన బంగ్లాదేశ్ తమ దేశ ఆటగాళ్ల కోసం కొత్త టీ20 టోర్నమెంట్‌ను ప్రారంభించనుంది. దీనికి ఓడోమ్మో బంగ్లాదేశ్ టీ 20 కప్ -2026 అని పేరు పెట్టింది. ఓడోమ్మో అంటే.. అజేయమైన లేదా ఎవరికీ లొంగనిది అని అర్థం. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ఈ టోర్నీ జరగనుంది. మూడు జట్లు పోటీపడతాయి. ధూమ్‌కేతు జట్టుకు లిటన్ దాస్, దర్బార్ టీముకు నజ్ముల్ హుస్సేన్ శాంటో, దురంటో జట్టుకు అక్బర్ అలీ నాయకత్వం వహించనున్నారు. ప్రైజ్‌మనీ, ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులకు రూ.187 కోట్లు ఖర్చు చేస్తామని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధికారి తెలిపారు. మ్యాచ్‌లకు మరింత ఊపు తీసుకొచ్చేందుకు 'ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ను ఈ టోర్నీలో ప్రవేశపెట్టనున్నారు. ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో గ్రూప్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ నెల 9న ఫైనల్ నిర్వహిస్తారు.




టీ20 ప్రపంచ కప్ 2026 ఈ నెల 7 నుంచి ప్రారంభంకానుంది. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. భారత్‌లో మ్యాచ్‌లు ఆడటానికి బంగ్లాదేశ్ నిరాకరించింది. దీంతో ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ప్రత్యామ్నాయ జట్టుగా ఆడించాలని ఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కొత్త టోర్నమెంటును ప్రారంభించాలని నిర్ణయించింది.

## భారత్‌తో మ్యాచ్ బహిష్కరించిన పాక్

టీ20 ప్రపంచకప్ -2026లో భారత్‌తో మ్యాచ్ ఆడే విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీమ్ ఇండియాతో మ్యాచ్‌ను బహిష్కరించాలని నిర్ణయించింది. అయితే, టోర్నీలో మిగతా మ్యాచ్‌లను మాత్రం ఆడతామని తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్, పాక్ మ్యాచ్ జరగాల్సి ఉంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభంకానున్న టీ20 ప్రపంచ కప్‌నకు భారత్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్నాయి. పాకిస్థాన్ మ్యాచ్‌లు కొలంబోలో షెడ్యూల్ చేసిన విషయం తెలిసిందే. పొట్టి కప్‌లో ఆడేందుకు ఇప్పటికే పాక్ తన జట్టును ప్రకటించింది.

చైతన్య రథం
సినిమా
సోమవారం 2 ఫిబ్రవరి 2026 IX

# రామ్‌చరణ్ 'డబుల్ హ్యాపీ'

రామ్‌చరణ్, ఉపాసన దంపతులకు కవలలు జన్మించడంతో కొణిదెల కుటుంబంలో సందడి నెలకొంది. జనవరి 31వ తేదీ రాత్రి ఉపాసన ఓ బాబు, పాపకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అలాగే ఆదివారం ఉదయం మీడియా ముందుకొచ్చి తెలిపారు. తాజాగా ఇదే విషయంపై రామ్‌చరణ్ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా 'డబుల్' ఆనందం వ్యక్తం చేశారు.

'మా జీవితంలో మరో మధుర క్షణాన్ని మీతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. మాకు ఒక బాబు, ఒక పాప జన్మించారు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలగడంతో ఎంతో ఆనందంగా ఉంది. మన జీవితంలో మహిళలే గొప్ప బలం. మాకు సంబంధించిన అన్ని విషయాల్లో మా వెంట నిలబడి అండగా ఉన్న అభిమానులకు, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమ, ఆశీస్సులు మాకు ఎల్లప్పుడూ శక్తినిస్తాయి' అని పేర్కొన్నారు. తన సతీమణితో కలిసి గతంలో దిగిన స్పెషల్ ఫొటోను పంచుకున్నారు. ఈ దంపతులకు ఇప్పటికే కుమార్తె క్లీంకార ఉన్న సంగతి తెలిసిందే.



# చాలా సంతోషంగా ఉంది..



నటుడు రామ్‌చరణ్-ఉపాసన దంపతులకు కవల పిల్లలు జన్మించిన నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి ఆదివారం మీడియాతో మాట్లాడారు. చాలా సంతోషంగా ఉందని చెప్పారు. రామ్‌చరణ్-ఉపాసన దంపతులకు శనివారం రాత్రి కవలలు జన్మించారు. దీంతో కొణిదెల, కామినేని కుటుంబాలు సంతోషంగా ఉన్నాయి. ఆ భగవంతుడి దయ, హనుమాన్ కృపతో ఒక మగబిడ్డ, ఒక ఆడబిడ్డ జన్మించారు. ఉపాసనతో పాటు బిడ్డలిద్దరూ చాలా ఆరోగ్యంగా ఉన్నారు. మా ఇంట శుభం కలగాలని ఎక్కడెక్కడి నుంచో కోరుకున్నారు. ఈ వార్తను మీతో పంచుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అభిమానులు దీన్ని పండుగలా భావిస్తున్నారు. వారి ఆనందానికి అవధుల్లేవు. అందరికీ ధన్యవాదాలు అని చిరంజీవి అన్నారు.

# ఉత్కంఠగా 'హనీ' ట్రైలర్




నవీన్ చంద్ర, దివ్యా పిళ్లై, దివి, రాజా రవీంద్ర కీలక పాత్రల్లో తెరకెక్కిన సైకలాజికల్ హర్రర్ థ్రిల్లర్ చిత్రం హనీ. పలాస, మట్కా సినిమాల ఫేం కరుణ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా ఈ చిత్రం ట్రైలర్ విడుదల చేశారు.

ఈ ట్రైలర్ చూస్తుంటే.. గతంలో వచ్చిన పిండం, ఇషా సినిమాలను తలదన్నేలా విభిన్న కాన్సెప్ట్‌తో రూపొందించినట్లు అర్థమవుతోంది. ఓ అరుదైన పిల్లి కోసం వెతకడం, అది వచ్చాక భయంకర ఘటనలు జరగడం ఇత్యాది సన్నివేశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ట్రైలర్ కట్ చేశారు. చూస్తుంటే సినిమాలో హర్రర్ అంశాలు గట్టిగానే ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. మూఢనమ్మకాలు నేపథ్యంలో గ్రిప్పింగ్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారు.

## బాలీవుడ్ దర్శకుడి ఇంటి వద్ద కాల్పుల కలకలం

బాలీవుడ్ డైరెక్టర్ రోహిత్ శెట్టి ఇంటిపై కాల్పుల ఘటన కలకలం రేపింది. గుర్తు తెలియని కొందరు వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున జుహూలోని ఆయన ఇంటి వద్ద కాల్పులకు దిగారు. ఈ విషయాన్ని ముంబై పోలీస్ కమిషనర్ దేవెన్ భర్తీ ధ్రువీకరించారు. గుర్తుతెలియని వ్యక్తులు రోహిత్‌శెట్టి నివసిస్తున్న భవనం పై కాల్పులు జరిపినట్లు తెలిపారు. ఘటనా స్థలంలో ఐదు బుల్లెట్ షెల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఎవ్వరికీ ఏమీ కాలేదని వెల్లడించారు. ఇక, ఈ సంఘటనపై స్థానిక పోలీసులతోపాటు ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు కూడా దర్యాప్తు చేస్తున్నారు.

కాల్పుల నేపథ్యంలో రోహిత్ ఇంటి వద్ద అధికారులు భద్రత కట్టుదిట్టం చేశారు. అయితే, ఈ కాల్పులకు తెగబడింది ఎవరు.. ఎందుకు అన్న సంగతి తెలియరాలేదు. పోలీసులు కూడా ఈ సంఘటనపై అధికారిక ప్రకటన ఇవ్వలేదు. కాల్పులు జరిగిన సమయంలో ఇంట్లో రోహిత్ శెట్టి ఉన్నారా.. లేదా అన్నదానిపైనా క్లారిటీ లేదు. రోహిత్ శెట్టి నుంచి కూడా ఎలాంటి స్పందన రాలేదు. సోషల్ మీడియాలో రోహిత్ శెట్టి ఇంటికి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. ఓ వీడియోలో డైరెక్టర్ ఇంటి వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులు ఉన్న దృశ్యాలు ఉన్నాయి.



# పబ్లిసిటీలో రాజమౌళి లెవలే వేరు!




తెలుగు సినిమా స్థాయిని ప్రపంచ పటంపై నిలబెట్టిన దర్శకుడు రాజమౌళి. ఆయన సినిమా ఒక అద్భుతమైన విజువల్ వండర్‌గా నిలిచిపోతుంది. సినిమాను తెరకెక్కించడం ఒక ఎత్తు అయితే, దాన్ని జనాల్లోకి తీసుకెళ్లడం మరో ఎత్తు. ఈ విషయంలో రాజమౌళిని మించిన వారు లేరనే చెప్పాలి. ప్రస్తుతం పాన్ ఇండియా వైడ్‌గా స్టార్ దర్శకులంతా ఆయన పబ్లిసిటీ స్ట్రాటజీనే ఫాలో అవుతున్నారు. తాజాగా సూపర్ స్టార్ మహేష్ బాబుతో చేస్తున్న వారణాసి విషయంలో కూడా రాజమౌళి తన మార్క్ మేజిక్ చూపిస్తున్నారు.

సాధారణంగా రాజమౌళి సినిమా అంటే ఏళ్ల తరబడి షూటింగ్ జరుగుతూనే ఉంటుంది. కానీ ఈసారి అందరికీ షాక్ ఇస్తూ, సినిమా సెట్స్‌పైకి వెళ్లకముందే ప్రీ-ప్రొడక్షన్ కోసం ఆరు నెలలకు పైగా సమయం కేటాయించారు. ఒక పక్క కథపై రకరకాల ఊహాగానాలు వస్తుంటే.. ఒక్క చిన్న గ్లింప్స్‌తో సినిమా స్పాన్ ఏంటో చూపించి అందరి నోళ్లు మూయించారు. కథను ముందుగానే చెప్పి ప్రేక్షకులను ప్రిపేర్ చేయడం ఆయన శైలి. అయితే వారణాసి విషయంలో మాత్రం రహస్యాన్ని మెయింటైన్ చేస్తూనే, హైప్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయ్యారు.



భారీ విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ ఉన్న ఈ సినిమా పూర్తి కావడానికి కనీసం మూడు నాలుగేళ్లు పడుతుందని అంతా భావించారు. కానీ రాజమౌళి మాత్రం సైలెంట్‌గా సోషల్ మీడియా వేదికగా రిలీజ్ డేట్‌ను ఎనౌన్స్ చేసి బాంబు పేల్చారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న, అంటే సరిగ్గా ఉగాది పండుగ రోజున ఈ వండర్ థియేటర్లలోకి రాబోతోంది. ఎటువంటి హంగామా లేకుండా సింపుల్‌గా డేట్ చెప్పేసి.. అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. సమ్మర్ సీజన్‌తో పాటు పండుగ సెలవులు కలిసి రావడంతో ఈ సినిమాకు లాంగ్ రన్ ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

సుమారు రూ.1300 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం పూర్తిగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో ఉండబోతోంది. అంటే ఇప్పటి వరకు మనం చూడని ఒక సరికొత్త అనుభూతిని జక్కన్న ప్లాన్ చేస్తున్నారు. అంతేకాదు, ఈ సినిమాలో రాముడిగా మహేష్ నటించాడని ఇప్పటికే ఓపెన్‌గా చెప్పేసిన రాజమౌళి, దానికి సంబంధించిన సీక్వెన్స్ నభూతో నభవిష్యత్తు అన్న రీతిలో తెరకెక్కించారని, ఆ సీన్స్ కి థియేటర్లలో ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తుందని ఫిల్మ్ నగర్ టాక్.

రాజమౌళి ప్లాన్ చూస్తుంటే నిర్మాత పెట్టిన ప్రతి రూపాయిని వంద రెట్లు లాభాలతో వెనక్కి తీసుకురావడం గ్యారెంటీ అనిపిస్తోంది. ఏది ఏమైనా రాజమౌళి ఆలోచనలు, ఆయన విజన్ సామాన్యమైనవి కావు. మహేష్ బాబును సరికొత్తగా చూపిస్తూనే, ఇండియన్ సినిమాను గ్లోబల్ లెవల్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. మరి ఈ వారణాసి ప్రయాణం ఇంకెన్ని రికార్డులను తిరగరాస్తుందో చూడాలి.

# నటుడు రఘునాథరెడ్డి కన్నుమూత

టాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు రఘునాథరెడ్డి కన్నుమూశారు. ఈ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆయన శనివారం రాత్రి కుషాయిగూడ ప్రథమపురి కాలనీలోని ఆయన నివాసంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.

తెలుగులో దాదాపు 350కు పైగా సినిమాల్లో నటించారు. శోభన్ బాబు 'సర్పయాగం' చిత్రంతో ఇండస్ట్రీలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా అడుగుపెట్టిన ఆయన ఆపై కలిసుందాం రా, ఒసేయ్ రాములమ్మ, ఒరేయ్ రిక్షా, చీమల దండు, ఇంద్ర, డాన్, తమ్ముడు, రాయలసీమ రామన్న చౌదరి, సీమ సింహం, మల్లీశ్వరి, సంక్రాంతి, శ్రీరామ రాజ్యం ఇలా పలు సినిమాల్లో కీలక పాత్రలు పోషించారు. చివరిగా 2018లో 'సుబ్రహ్మణ్య పురం' సినిమాలో నటించిన రఘునాథరెడ్డి అనారోగ్యం కారణంగా సినిమాలకు గుడ్ బై చెప్పారు.

రఘునాథ రెడ్డిది కృష్ణా జిల్లా కుందేరు గ్రామం. కృష్ణారెడ్డి, సామ్రాజ్యమ్మ దంపతులకు జన్మించారు. ఆపై విజయవాడ, మచిలీపట్నంలలో ఆయన విద్యాభ్యాసం జరిగింది. సౌత్ సెంట్రల్ రైల్వే లాలాగూడ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్నప్పుడు పరుచూరి బ్రదర్స్ సహకారంతో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆయనకు ఒక కుమారుడు మరియు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

